# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 25-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:17 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

వ్యోమాంకుర సంస్థలపై
ప్రేమను గురియుచు ప్రధాని విస్పష్టముగా
కామనతతుల నొసంగగ
మామకుడని ప్రజ లిడిరి నమస్కారములన్ !!

(వ్యోమాంకుర సంస్థలు( స్పేస్ స్టార్టప్స్)వాలా గొప్ప నిర్ణయం తీసుకున్నాయి అని ప్రధాని నరేంద్ర మోదీ వాటి అధిపతులను ఉత్సాహపరిచి ప్రభుత్వపరంగా ప్రోత్సాహకాలను ప్రకటించడంతో ప్రజలందరూ మోదీ గారి దూరదృష్టిని ప్రశంసిస్తూ జేజేలు పలుకుతున్నారు.)



-రాధశ్రీ

సెల్:9494481210

**చురక**

రైజింగ్ తెలంగాణ
రెక్కలిరిచే గాయం
చేస్తూ దాన్ని కుట్రలతో
చేయగలరా మాయం.
పార్టీ కక్షలుంటేనేమి
ప్రగతికడ్డు ఎందుకు
ప్రభుత్వం మంచిచేస్తూ
పోతుంటే ముందుకు



-వేల్పుల నారాయణ

9440433475

# ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యం-సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 24: వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(సోమవారం) మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని వివరించారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు.

టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు.

'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చింది. ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారు? గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



# పేద విద్యార్థుల కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## -విద్యార్థులకు నాణ్యమైన భోజనంలో రాజీ వద్దన్న మంత్రి శ్రీధర్ బాబు



కరీంనగర్, ఆగస్టు 24: పేద విద్యార్థుల కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం మంథని పట్టణంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను మంత్రి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి శుభ్రమైన వాతావరణంలో తయారు చేసిన నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతలు చేపట్టిన హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులకు మంత్రి పలు సూచనలు చేశారు. ఆహార నాణ్యత, శుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని ఆదేశించారు. నిర్ణయించిన మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని విద్యార్థులకు సమయానికి అందించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యమే ప్రభుత్వానికి ముఖ్యమని, ఆహార తయారీలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు టిఫిన్ అందించడం ద్వారా పాఠశాలల్లో హాజరు శాతం కూడా పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

ఈ ఆధునిక వంటశాల ద్వారా మంథని నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వేడి, నాణ్యమైన భోజనం సరఫరా కానుందని మంత్రి తెలిపారు. దీనివల్ల విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు వారి ఆరోగ్య ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి చదువుపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మంథని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ అరిఫుద్దీన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డి, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు శశిభూషణ్ కాచే, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్ హాజరయ్యారు.

స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వంటశాల నిర్వహణ, ఆహార తయారీ, సరఫరా ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# ప్రమాదకరంగా ఉన్నవాటిని గుర్తించి తొలగిస్తున్నాం

## -ముప్పు తప్పించేందుకు చర్యలు తప్పవన్న హైడ్రా కమిషనర్
## -సీఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన

హైదరాబాద్, ఆగస్టు 24:గచ్చిబౌలి సమీపంలోని అంజయ్య నగర్‌లో ఏడు అంతస్తుల భవనం కూలిన ఘటన తర్వాత హైడ్రా అధికారులు అప్రమత్తమయ్యారు. పరిసర ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న భవనాలను గుర్తి ప్రాణ నష్టం జరగకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. కూలిపోవడానికి అవకాశం ఉన్న నిర్మాణాలను తొలగించడంలో వెనుకాడబోమని స్పష్టం చేశారు.

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌తో కలిసి సోమవారం అంజయ్యనగర్‌లో రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. శనివారం ఏడు అంతస్తుల భవనం కుప్పకూలిన ప్రాంతాన్ని పరిశీలించి, పక్కనే ఉన్న భవనాల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. ఇప్పటికే దెబ్బతిన్న మరో భవనం తొలగింపు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానికులు మరికొన్ని భవనాలు కూడా ప్రమాదకరంగా ఉన్నాయని ఫిర్యాదు చేయడంతో వాటిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అవసరమైతే ఆయా నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



### నిబంధనలు ఉల్లంఘించడమే ప్రధాన కారణమా

చిన్న స్థలాల్లో అనుమతులకు మించి అంతస్తులు నిర్మించడం వల్ల భవనాల పటిష్టత దెబ్బతింటోందని రంగనాథ్ పేర్కొన్నారు. వరద కాలువను కొంత మేర ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, పరిమిత స్థలంలో భారీ భవనాలు నిర్మించడం వంటి అంశాలు కూడా ప్రమాదానికి కారణమవుతున్నాయని వివరించారు. 50 గజాల స్థలంలో రెండు అంతస్తుల నిర్మాణానికి అనుగుణంగా పునాదులు, పిల్లర్లు వేసి, ఆపై ఏడు లేదా ఎనిమిది అంతస్తులు నిర్మిస్తే భవన సామర్థ్యంపై ప్రభావం పడుతుందని తెలిపారు. అనుమతులు లేకుండా, నిబంధనలను పక్కనపెట్టి చేపట్టిన నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని చెప్పారు.

### పక్క భవనాలకు ముప్పు లేకుండా చర్యలు

దెబ్బతిన్న భవనాలను తొలగించే సమయంలో పక్కనే ఉన్న అపార్టుమెంట్లు, ఇతర నిర్మాణాలకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా పరిసర భవనాల్లోని వారిని ఖాళీ చేయించినట్లు చెప్పారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం వల్లే తొలగింపు పనుల్లో కొంత జాప్యం జరుగుతోందని వివరించారు. ఎప్పుడు ఏ భవనం కూలిపోతుందో తెలియని పరిస్థితుల్లో ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తప్పనిసరి అని రంగనాథ్ స్పష్టం చేశారు.

# 22ఏపై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్న ప్రతిపక్షాలు: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, ఆగస్టు 24: హైదరాబాద్‌లో 22ఏపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయంటూ ప్రతిపక్షాలపై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. 22ఏపై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్నాయని ఆయా పార్టీలపై మండిపడ్డారు. గతంలో రిలాక్స్ ఇచ్చిన వాటికి క్లియరెన్స్ ఇచ్చామని తెలిపారు. నిజమైన (జెన్యూన్‌గా) వాటిలో 98 శాతం రిజిస్ట్రేషన్ చేశామన్నారు. చేయలేనివి చేయలేమని తేల్చి చెప్పామని వివరించారు.

అయితే టోల్ ఫ్రీ నంబర్ పని చేయడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వాదనను మంత్రి పొంగులేటి ఖండించారు. అందులో వాస్తవం లేదని చెప్పారు. ఇప్పటి వరకు ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు 1,162 కాల్స్ వచ్చాయని పేర్కొన్నారు. అందులో రిపీటెడ్ కాల్స్ తొలగిస్తే.. 980 వచ్చాయన్నారు. వాటిలో 547 వ్యవసాయానికి అనుబంధమైనవి, 433 వ్యవసాయేతర కాల్స్ అని వివరించారు. రిజిస్ట్రేషన్ కాలేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

కొందరు దొంగ జీవోలు, మెమోలు తెచ్చి రిజిస్ట్రేషన్ కోసం ఒత్తిడి చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అలాంటివారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి దొంగ జీవోలతో రిజిస్ట్రేషన్ చేసుకోవడం సాధ్యం కాదని మంత్రి పొంగులేటి కుండ బద్దలు కొట్టారు. సిఎస్7, సిఎస్ 14పై దశాబ్దాలుగా వివాదాలు ఉన్నాయని గుర్తు చేశారు. తెర ముందు సామాన్యులను పెట్టి వెనక తమ ఎజెండాను అమలు చేస్తున్నారని అన్నారు.వివాదాస్పద భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పలువురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఖరీదైన కార్లు తీసుకుని సిఎస్7, సిఎస్14 భూములు రిజిస్ట్రేషన్ చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ విషయాన్ని లేవనెత్తడంతో వివాదంలో పడ్డాయని వివరించారు. ఆ 811 ఎకరాల భూములపై విచారణకు సిద్ధమా? అని ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు.

సర్వే నంబర్ 403లో సీఎం రేవంత్ రెడ్డి నివాసం ఉంటుందని అన్నారు. ఆ సర్వేలో 1,288 ఎకరాలు ఉండగా రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయని చెప్పారు. అధికారులు చేసిన తప్పిదం వల్ల ఆ సర్వే మొత్తం నిషేధిత జాబితాలోకి వెళ్లితే సరిచేశామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు.

# మత్స్యశాఖ తుంగతుర్తి నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నల్గొండ, ఆగష్టు 24: తుంగతుర్తిలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మత్స్యశాఖ నూతన కమిటీని జిల్లా సహకార సంఘం కార్యాలయ అసిస్టెంట్ రిజిస్టర్ కె.పద్మజ అధ్యక్షతన సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మత్స్యశాఖ అధ్యక్షుడిగా రెండోసారి కొండ లింగయ్య, ఉపాధ్యక్షుడిగా అంబటి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా మామిడి నాగరాజు, మెంబర్లుగా మామిడి లింగయ్య, మామిడి నరేశ్, దిండి ముత్యాలు కొండ వెంకన్న, సాధు వెంకన్న, అంబటి బుచ్చయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారుల సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తామని, తమ ఎన్నికలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సభ్యులు, నాయకులు కొండ ఎల్లయ్య, కొండ రాజు, కొండా వరశురాం, సుధాకర్ పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలంగాణకు భారీ వర్షసూచన

హైదరాబాద్, ఆగష్టు 24: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఈ అల్పపీడనం ప్రభావంతో తెలంగాణ లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. వాతావరణ కేంద్రం వెల్లడించిన ప్రకారం.. సోమవారం కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఇవి కాకుండా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ సహా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది. వర్షం సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నది.

# మణిపూర్‌లో కాల్పులు.. పారామిలిటరీ జవాన్‌కు గాయం, పలు ఇళ్లకు నిప్పు



ఇంఫాల్, ఆగష్టు 24: మణిపూర్‌లో ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దుండగులు పలు ఇళ్లకు నిప్పుపెట్టారు. భద్రతా సిబ్బంది అక్కడకు చేరుకోగా కాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో ఒక జవాన్ కాలుకు గాయమైంది. కాంగ్‌పోక్పి జిల్లాలోని సేనాపతి, పరిసర ప్రాంతాల్లో ఈ సంఘటనలు జరిగాయి. సోమవారం తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో నాగా తెగలకు చెందినవారి ఇళ్లను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. తఫౌ కుకి, ఫూబా గ్రామాల్లో నాగా నివాసితుల ఇళ్లకు నిప్పుపెట్టారు. లై గ్రామానికి చెందిన నాగా నివాసి ఇంటిని కూల్చివేశారు. 9ఎంఆర్, మారెయిమెయి పరిసరాల్లో కూడా నాగా తెగలకు చెందిన ఇళ్లపై దాడులు జరిగాయి.

కాగా, ఈ సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బందితో పాటు పారామిలిటరీ దళాలు ఆయా ప్రాంతాలకు చేరుకున్నాయి. అయితే లియాంగ్‌మై తఫౌ వద్ద ఊహించని విధంగా కాల్పులు జరిగాయి. 36 సీఆర్‌పీఎఫ్‌కు చెందిన జవాన్ కాలికి బుల్లెట్ గాయమైంది. సేనాపతిలోని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇరువైపుల నుంచి కాల్పులు జరిగినట్లు కనిపించిందని, అయితే బుల్లెట్ ఏ దిశ నుంచి వచ్చిందో తాను గుర్తించలేకపోయానని గాయపడిన ఆ జవాన్ తెలిపారు.

మరోవైపు తమ ఇళ్లను లక్ష్యంగా చేసుకోవడంపై నాగా తెగల ప్రజలు ఆగ్రహం చెందారు. ఇంఫాల్ దిమాపూర్ హైవేను దిగ్బంధించారు. దీంతో మణిపూర్, నాగాలాండ్ మధ్య ఉన్న నేషనల్ హైవే 2 మార్గంలో రాకపోకలకు అంతరాయం కలిగింది. తమ ఇళ్లను లక్ష్యంగా చేసుకున్న వారిపై 24 గంటల్లో చర్యలు తీసుకోవాలని నాగా తెగల సంస్థ డిమాండ్ చేసింది.

# మళయాలీ సంప్రదాయాల కనువిందు ఓనం పండగ

## (16 – 26 ఆగష్టు "ఓనం పర్వదినం" సందర్భంగా)

కేరళ రాష్ట్రవ్యాప్తంగా మతాలకు అతీతంగా మళయాలీ పౌర సమాజం పెద్ద ఎత్తున నిర్వహించుకునే పర్వదినంగా "ఓనం"కు ఘన చరిత్ర ఉంది. సోదరభావం, ఆనందం, సాంస్కృతిక వారసత్వం మేలు కలయికగా ఓనం పండుగ నిలుస్తున్నది. మలయాళ మాసం 'చింగం'లో వస్తుంది. పది రోజుల పాటు వివిధ ఆచార సంప్రదాయాలతో నిర్వహించుకునే ఓనం పంటల పండుగ (హార్వెస్ట్ ఫెస్టివల్) ఈ ఏడాది 16 ఆగష్టున 'అర్థం' రోజున ప్రారంభమై, 5వ రోజు 'అనిశం', 9వ రోజున 'ఉత్రడం', 10వ రోజున 26 ఆగష్టు రోజున 'తిరువోణం'తో ముగుస్తుంది. మొదటి రోజు తుంబపూ పువ్వులతో 'అథపూకలం' పండుగగా ప్రారంభం అయిన ఓనం పది రోజుల పాటు వివిధసంప్రదాయాలతో సంతోషాల విందుల నడుమ కొనసాగుతుంది. చివరి రోజున 26 ఆగష్టు రోజున ఓనం దేవుడైన 'త్రికాకర అప్పన్'కు పూజలు చేసి నైవేద్యాలు అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించి పూకలాన్ని తొలగిస్తారు. ఓనం రోజుల్లో పులికళి, తిరువతికళి, ఓనప్పట్టు మొదలైన సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ఓనం పండుగ చరిత్ర:

పురాణాల ప్రకారం దుష్ట చక్రవర్తి మహాబలి పాలనలో మాత్రం చక్కటి పద్ధతులు పాటిస్తూ ప్రజలను చింతలు లేకుండా చూస్తూ సుఖ సంతోషాలలో ముంచే వారు. దీనిని గమనించిన దేవతలు ఈ దుష్టరాజు ఎదుగుదలను ముప్పుగా భావించి విష్ణుమూర్తిని ఆశ్రయిస్తారు. వారి కోరికను తీర్చడానికి విష్ణుమూర్తి అంగీకరిస్తారు. నర్మదా నదీ తీరంలో విశ్వజిత్ యాగం చేస్తున్న మహాబలి యాగశాలకు వామనుడు అనే బ్రాహ్మణ బాలుని రూపం వస్తాడు. ఆ బాలుడిని అత్యంత గౌరవ మర్యాదలతో ఆహ్వానించిన మహాబలి చక్రవర్తి వామనుడిని తనకు ఇష్టమైన కోరికలు కోరుకొమ్మని విజ్ఞప్తి చేస్తాడు. అప్పుడు వామనుడు తనకు మూడు అడుగుల మేర భూమి కావాలని కోరుకుంటాడు. దానికి సంతోషంగా అంగీకరించిన మహాబలి మూడు అడుగుల నేల తీసుకొమ్మంటాడు. ఇందుకుగాను ఒక ?గు భూమిపై, రెండవ అడుగు ఆకాశంపై పెట్టగా మూడవ అడుగు ఎక్కడ పెట్టాలని అడుగుతాడు. అందుకు స్పందించిన మహాబలి మూడవ అడుగును తన తలపై పట్టమని అంటాడు. అలా వామనుడి మూడవ అడుగును మహాబలి తలపై పెట్టి పాతాళ లోకమైన సూతలకు పంపిస్తాడు. అతని తలపై పాదాలు మోపిన ప్రదేశాన్ని 'త్రికక్కర గ్రామం' అని నేటికీ పిలుస్తారు. మహాబలి మాటకు మెచ్చిన విష్ణుమూర్తి ఆయనకు ఏడాదికి ఒక రోజు తన రాజ్యానికి వచ్చి ప్రజలను సందర్శించమని వరం ఇస్తాడు.

అదే ప్రకారం ఓనం 10వ రోజున 'తిరువోణం'ను అత్యంత భక్తితో జరుపుకుంటారు. తిరువోణం రోజున ప్రజలు కొత్త బట్టలు ధరించి, 'ఓనసాద్య' అనే విందును ఆరగిస్తూ, అందరూ కలిసి ఐక్యంగా, ఘనంగా, సంతోషంగా ఈ పండుగను జరుపుకుంటారు.

ఓనం పండుగ పది రోజుల పాటు సాంస్కృతిక ఉత్సవాలు, ఊరేగింపులు, పడవ పందాలు, జానపద కళల ప్రదర్శనలు, శకటాల హంగామాలు, డప్పు సంగీత వాయిద్యాలు, పులకలి నృత్యాలు, పూల అలంకరణలతో పూలకం, ఓనం సధ్య అని పిలిచే ఆహార పండుగ,ఉయ్యాల ఊగడం లాంటి సంప్రదాయ వేడుకలను అతి ఇష్టంగా, భక్తి ప్రపత్తులతో నిర్వహించుకుంటారు. మనవైన సంప్రదాయ పండుగలను ఘనంగా నిర్వహించుకుంటూ మన గట్టి సాంస్కృతిక పునాదులను భద్రపరుచుకుందాం.



–మధుపాళీ
9949700037

# బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశంలో భారత ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ, శ్రీమతి రక్షా నిఖిల్ ఖడ్సే




న్యూఢిల్లీ, ఆగష్టు 24:భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని యువజన వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశం ఆగష్టు 22, 2026న శనివారం రోజున విశాఖపట్నంలో విజయవంతంగా ముగిసింది.

ఈ సమావేశానికి యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ గౌరవ కేంద్రమంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయమంత్రి శ్రీమతి రక్షా నిఖిల్ ఖడ్సే, యువజన వ్యవహారాల విభాగం కార్యదర్శి శ్రీ సునీల్ పలివాల్ పాల్గొన్నారు.

బ్రిక్స్ యువజన శిఖరాగ్ర సమావేశం, బ్రిక్స్ యువజన మండలి సమావేశం ఫలితాల ఆధారంగా మంత్రుల సమావేశంలో చర్చలు సాగాయి. ఈ వేదికల నుంచి వెలువడిన సిఫార్సులు, దృక్పథాలు మంత్రుల స్థాయి చర్చలకు కీలక ఆధారంగా నిలిచాయి.

యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ గౌరవ కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. "భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి, అంటే 2047 నాటి కోసం గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో మేం ఒక విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాం. ఈ దిశగా దేశాన్ని నడిపించేందుకు రాజకీయ నేపథ్యం లేని 1,00,000 మంది యువ నాయకులను తయారుచేయాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు" అని తెలిపారు.

'ఈ స్ఫూర్తితోనే మేం అనేక కార్యక్రమాలను ప్రారంభించాం. వాలంటీర్ పనిచేయటం, నేర్చుకోవటం, నాయకత్వం, పౌర భాగస్వామ్యం కోసం ఏకైక వేదికగా మైభారత్ పోర్టల్‌ను తయారు చేశాం. నేడు 25 మిలియన్లకు పైగా యువత ఈ వేదికలో రిజిస్టర్ అయి, ఉత్సాహంగా పాల్గొంటున్నారు" అని అన్నారు.

బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాల యువ ప్రతినిధులు, యువ నాయకులు, విధాన రూపకర్తలు, ఉన్నతాధికారులను ఈ వేదికలు ఒకచోట చేర్చాయి. ఇవి యువతకు ప్రాధాన్యతనిచ్చే అంశాలపై చర్చించేందుకు, అనుభవాలను పరస్పరం పంచుకునేందుకు, కలిసి పనిచేసేందుకు సరైన వేదికలుగా నిలిచాయి.

యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రి మాట్లాడుతూ... మెరుగైన భవిష్యత్తును తీర్చిదిద్దటంలో యువత భాగస్వామ్యం కీలకమని స్పష్టం చేశారు. "బ్రిక్స్ భారత అధ్యక్షతన మా విధానం చాలా స్పష్టంగా ఉంది. యువతను కేవలం లబ్ధిదారులుగా మాత్రమే కాక భవిష్యత్తును తీర్చిదిద్దటంలో ఉమ్మడి క్రియాశీల భాగస్వాములుగా గుర్తించాలి. యువత భాగస్వామ్యం నుంచి యువత భాగస్వామ్య బంధానికి, సంప్రదింపుల నుంచి సహ–రూపకల్పన, యువత కోసం కార్యక్రమాలు నుంచి యువతతో కలిసి వేదికల నిర్మాణం దిశగా మనం అడుగులు వేద్దాం. భవిష్యత్తు కోసం మాత్రమే యువత సన్నద్ధం కావటమే కాక, తామే స్వయంగా భవిష్యత్తును తీర్చిదిద్దేలా బ్రిక్స్ దేశాలను నిర్మిద్దాం" అని తెలిపారు.

బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశం సందర్భంగా 'ఏక్ పేడ్ మా కే నామ్' మొక్కలు నాటే ప్రత్యేక కార్యక్రమంలో బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొని, వారి మాతృమూర్తుల గౌరవార్థం ఒక్కో మొక్కను నాటారు. మాతృమూర్తుల పట్ల కృతజ్ఞతను చాటే హృదయపూర్వక, ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని పర్యటనకు వచ్చిన ప్రతినిధి బృందాలు అభినందించాయి.

విశాఖపట్నం సమీపంలోని ప్రముఖ చారిత్రక వారసత్వ ప్రదేశాల్లో ఒకటైన తొట్లకొండ బౌద్ధారామాన్ని కూడా ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భన భారతదేశ సుసంపన్న నాగరికత వారసత్వాన్ని, శాంతి, సామరస్యాలు, సాంస్కృతిక మార్పిడికి సంబంధించిన సుదీర్ఘ సంప్రదాయాలను ప్రతినిధులకు కళ్లకు కట్టినట్లు చూపింది. పర్యటనకు వచ్చిన ప్రముఖుల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ మొత్తం కార్యక్రమం... సుసంపన్నమైన సాంస్కృతిక కోణాన్ని జోడించటంతో పాటు బ్రిక్స్ దేశాల యువత మధ్య మైత్రిని, పరస్పర అవగాహనను మరింత బలోపేతం చేసింది.

గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఆగష్టు 19 నుంచి 20, 2026 వరకు జరిగిన బ్రిక్స్ యువజన సదస్సు, బ్రిక్స్ యువజన మండలి సదస్సు అనంతరం యువజన కార్యక్రమాల ముగింపులో భాగంగా బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశాన్ని నిర్వహించారు. బ్రిక్స్ సభ్య దేశాల యువజన వ్యవహారాల మంత్రులు, సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. యువజన సహకారంలో సాధించిన పురోగతిని సమీక్షించటం, విధివిధానాలపై దృక్పథాలను పరస్పరం పంచుకోవటం, సమ్మిళిత, సుస్థిరాభివృద్ధిలో యువత పాత్రను మరింత ముందుకు తీసుకెళ్లటంపై ఈ సమావేశంలో చర్చించారు.సంయుక్త ప్రకటనను ఆమోదించటం... ఈ సమావేశ ముగింపులో కీలకమైనది. ఇది బ్రిక్స్ దేశాల మధ్య యువజన సహకారాన్ని బలోపేతం చేయటానికి, అభివృద్ధి ప్రక్రియల్లో యువత పాల్గొనేలా ప్రోత్సహించటానికి ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఈ సంయుక్త ప్రకటనలో విద్య, శిక్షణ, నైపుణ్యాలు, యువజన పారిశ్రామికవేత్తల అభివృద్ధి, శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణ, సామాజిక, సాంస్కతిక భాగస్వామ్యం, సామాజిక సేవ, వాలంటరీ కార్యక్రమాలు, అభివృద్ధి, పేదరికం, ఆకలి, అసమానతల నిర్మూలన, ఆరోగ్యం, యువత, క్రీడలు, యువత, పర్యావరణం, సుస్థిరత, వివిధ మతాల యువత చర్చ, యువజన మార్పిడి కార్యక్రమాలు, యువత భాగస్వామ్యం వంటివి ప్రధాన అంశాలు.యువత సామర్థ్యాలను పెంపొందించుకోవటానికి, నిర్ణయాల్లో అర్థవంతంగా భాగస్వాములయ్యేందుకు, యువతకు సంబంధించిన సమకాలీన సమస్యల పరిష్కారానికి సహకరించేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించటం మంత్రుల సమావేశంలో చర్చించిన కీలక అంశాల్లో ఒకటి. యువత నేతృత్వంలోని కార్యక్రమాలను బలోపేతం చేయటం, నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకతను పెంపొందించటం, అనుభవాలను పరస్పరం పంచుకోవటం, సాధారణ ప్రయోజన అంశాలపై అభిప్రాయాలను అందించటం ద్వారా వివిధ దేశాల మధ్య యువత సహకారాన్ని పెంపొందించాల్సిన ప్రాధాన్యతను స్పష్టం చేశారు.

బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశం విజయవంతంగా ముగియటం, బ్రిక్స్ యువజన మంత్రుల సంయుక్త ప్రకటనకు ఆమోదం లభించటం, బ్రిక్స్ దేశాల మధ్య యువజన సహకారాన్ని ముందుకు తీసుకెళ్లటంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలుస్తుంది.బ్రిక్స్ దేశాల యువకులు, సంస్థల మధ్య భాగస్వామ్యాలను బ్రిక్స్ యువజన కార్యక్రమాలు బలపరిచాయి. పరస్పర అవగాహనను పెంపొందించాయి. నిరంతర సహకారానికి నూతన మార్గాలను సృష్టించాయి.

బ్రిక్స్–2026 భారతదేశ అధ్యక్షతన, "పటిష్ఠత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" ఇతివృత్తానికి అనుగుణంగా... ఉత్తమ పద్ధతులను పరస్పరం పంచుకోవటం, జాతీయ ప్రాధాన్యతలు, సహకార చర్యలపై ప్రత్యేక దృష్టి సారించి యువజన సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఈ యువజన వేదికలు సహకరించాయి.

బ్రిక్స్–2026 భారతదేశ అధ్యక్షతన బ్రిక్స్ యూత్ క్యాలెండర్ ఆఫ్ యాక్టివిటీస్‌లో భాగంగా బ్రిక్స్ యువజన సదస్సు, బ్రిక్స్ యువజన మండలి సమావేశం, బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆగష్టు 22, 2026న ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశం విజయవంతంగా జరిగింది.

భారత బ్రిక్స్ అధ్యక్ష హోదా ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో ఈ వేదిక ద్వారా సాధించిన ఫలితాలు భవిష్యత్ సహకారానికి బలమైన పునాదిని అందిస్తున్నాయి. మరింత పటిష్ఠమైన, నూతన ఆవిష్కరణలతో కూడిన, సమ్మిళిత, సుస్థిర భవిష్యత్ నిర్మాణంలో యువశక్తిని వినియోగించుకోవాలనే బ్రిక్స్ దేశాల ఉమ్మడి నిబద్ధతను ఇవి మరోసారి స్పష్టం చేశాయి.

బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశం సందర్భంగా... దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల మంత్రులతో డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. నైపుణ్యాభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలు, యువత భాగస్వామ్యానికి డిజిటల్ వేదికలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ... యువజన వ్యవహారాలు, క్రీడా రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయటంపై ఈ చర్చలు దృష్టి సారించాయి.

యువత, క్రీడా రంగాల్లో భారత్, సంబంధిత దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయటానికి... మార్పిడి కార్యక్రమాలు, సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు, సంస్థాగత విధానాల ద్వారా మరింతగా సహకరించుకోవాలని అన్ని దేశాలు చర్చించాయి.

# బురద రోడ్లపై ఇసుక పోయిస్తూ ప్రజలకు అండగా సర్పంచ్

## –వర్షాలతో దెబ్బతిన్న రహదారులపై ప్రత్యేక చర్యలు



ఆదిలాబాద్, ఆగష్టు 24:మండల కేంద్రంలోని జంబుల్దారి గ్రామపంచాయతీ పరిధిలో వర్షాల కారణంగా బురదమయంగా మారిన రహదారులపై ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ కొమరం పవన్, ఉపసర్పంచ్ గుర్నులే విట్టల్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బురదగా మారిన రహదారులపై ఇసుక పోయించి ప్రజలు సులభంగా రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టారు. వర్షాల కారణంగా రోడ్లపై బురద పేరుకుపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి వెంటనే స్పందించారు. గ్రామస్థులకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక చర్యలు చేపట్టారు.ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శి ఎండీ జావుద్ అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. వర్షాకాలంలో రహదారుల సమస్యలపై స్పందిస్తూ సర్పంచ్ కొమరం పవన్, ఉపసర్పంచ్ గుర్నులే విట్టల్ తీసుకుంటున్న చర్యలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రహదారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన చోట ఇసుక పోయించడం ద్వారా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించడం అభినందనీయమని గ్రామస్థులు తెలిపారు.

# కన్నెపల్లిలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

## –అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలి



ఆదిలాబాద్, ఆగష్టు 24:మండలంలోని కన్నెపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రేషన్ షాపులో సోమవారం డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ ప్రారంభించి, అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ రేషన్ కార్డుల విధానం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ సరుకులు మరింత సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

డిజిటల్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ సేవలు లబ్ధిదారులకు మరింత సులభతరం అవుతాయని చుంచు శ్రీనివాస్ పేర్కొన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం కూడా సంక్షేమ పథకాలకు దూరం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేద, అర్హులైన కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కన్నెపల్లి గ్రామ సర్పంచ్ తుమారం మను, పంచాయతీ కార్యదర్శి మాధవి, వీఆర్‌ఏ గణేష్, లబ్ధిదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత నిర్ణయాధికారుల ద్వారా రూ.5 కోట్ల వరకు సైబర్ వివాదాల పరిష్కారం... టీడీశాట్ ద్వారా అప్పీలుకు అవకాశం: జస్టిస్ డీ.ఎన్. పటేల్

న్యూ ఢిల్లీ, ఆగష్టు 24:టెలికాం, బ్రాడ్‌కాస్టింగ్, విమానాశ్రయ సుంకాలు, సైబర్ సాంకేతికతల వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో సమర్థవంతంగా, సకాలంలో, ప్రత్యేక విధానాల ద్వారా వివాదాలను పరిష్కరించాల్సిన ఆవశ్యకతను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తెలియజేశారు.

"విమానాశ్రయ సుంకాలు, టెలికాం, బ్రాడ్‌కాస్టింగ్, సైబర్ రంగాల్లో వివాదాల పరిష్కార విధానాలు" అంశంపై నిర్వహించిన సదస్సునుద్దేశించి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ప్రసంగిస్తూ.. సాంకేతికంగా క్లిష్టమైన నియంత్రణ వివాదాలను ఎదుర్కోవటంలో ప్రత్యేక న్యాయ నిర్ణేత సంస్థలకు పెరుగుతున్న ప్రాముఖ్యతను వెల్లడించారు.

టెలికమ్యూనికేషన్స్ రంగంలో ప్రత్యేక వివాద పరిష్కార విధాన పరిణామ క్రమాన్ని వివరిస్తూ... టెలికాం రంగంలో సరళీకరణ, ప్రైవేట్ సంస్థల ప్రవేశంతో నూతన నియంత్రణ, న్యాయ నిర్ణయ విధానాల ఆవశ్యకత ఏర్పడిందని జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. 1997లో టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్), 2000 సంవత్సరంలో టెలికాం వివాదాల పరిష్కారం, అప్పీలు ట్రిబ్యునల్ (టీడీశాట్) ఏర్పాటు ఈ పరిణామ క్రమంలో కీలకంగా నిలిచాయని చెప్పారు.

టీడీశాట్ పరిధి కేవలం టెలీకమ్యూనికేషన్స్‌కే పరిమితం కాకుండా.. బ్రాడ్‌కాస్టింగ్, కేబుల్ సర్వీసెస్, విమానాశ్రయ సుంకాల వ్యవహారాల వంటి రంగాలకు కూడా విస్తరించిందన్నారు. విషయ నైపుణ్యాన్ని, న్యాయ ప్రక్రియలను ఒకచోట చేర్చటం ద్వారా సాంకేతికంగా క్లిష్టమైన నియంత్రణ వివాదాలను పరిష్కరించటంలో ప్రత్యేక ట్రిబ్యునళ్లు కీలక వేదికలుగా సేవలందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ట్రిబ్యునళ్ల పాలనకు సంబంధించిన రాజ్యాంగ వ్యవస్థ గురించి ప్రస్తావిస్తూ... ప్రత్యేక విచారణ విధానాలు చట్టబద్ధమైన పాలన పరిధిలోనే పనిచేయాలని జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ స్పష్టం చేశారు. ఎల్. చంద్ర కుమార్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన సూత్రాలను ఉటంకిస్తూ హైకోర్టులు, సుప్రీంకోర్టులు నిర్వహించే న్యాయ సమీక్ష భారత రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని పేర్కొన్నారు. ట్రిబ్యునళ్లు న్యాయవ్యవస్థకు సహాయకారిగా పనిచేస్తూనే, రాజ్యాంగపరంగా న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని స్పష్టం చేశారు.

న్యాయ నిర్ణయాధికార సంస్థలు... నియంత్రణ స్వయం ప్రతిపత్తి, ప్రత్యేక నైపుణ్యం, న్యాయపరమైన జవాబుదారీతనం మధ్య సమతుల్యతను పాటించాలని జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ స్పష్టం చేశారు. నియంత్రణకు ప్రత్యామ్నాయంగా న్యాయ నిర్ణయాన్ని అనుమతించటం లేదా నియంత్రణ నిర్ణయాలను సమర్థవంతమైన పరిశీలనకు విరుద్ధంగా చేయడం ఉండకూడదని ఆయన హెచ్చరించారు. సకాలంలో వివాదాల పరిష్కారం కూడా ముఖ్యమని... సుదీర్ఘ కాలం పాటు నలిగే వ్యాజ్యాలు నియంత్రణ లక్ష్యాలను దెబ్బతీస్తాయని, పరిశ్రమలకు, వినియోగదారులకు అనిశ్చితిని కలిగిస్తాయని చెప్పారు.

విమానాశ్రయాల ఆర్థిక నియంత్రణపై మాట్లాడుతూ... విమానాశ్రయాలు బహుళ వాటాదారులు, పరస్పరం అనుసంధానమైన సేవలతో కూడిన సంక్లిష్టమైన ఆర్థిక వ్యవస్థలని తెలిపారు. ఎయిర్ పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా చట్టం ద్వారా టారిఫ్ నిర్ణయాలను, అప్పీలేట్ వివాద పరిష్కారాన్ని నియంత్రణ వ్యవస్థ అందిస్తుందని... సంబంధిత వివాదాలను పరిష్కరించటంలో టీడీశాట్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

టెలికాం, ప్రసార రంగాల గురించి చర్చిస్తూ... లైసెన్సింగ్, స్పెక్ట్రమ్, ఇంటర్‌కనెక్షన్, సేవా నాణ్యత, సిగ్నల్స్ అందుబాటు, ధరల నిర్ణయానికి సంబంధించిన అంశాలను జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ప్రస్తావించారు. ఈ రంగాల్లో సమర్థవంతమైన నియంత్రణ వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించటంతో పాటు ఆరోగ్యకరమైన పోటీని, స్థిరమైన వ్యాపార వాతావరణాన్ని ప్రోత్సహించాలని తెలిపారు.

సైబర్, కృత్రిమ మేధ రంగాల్లోని నూతన సవాళ్లపై ఆయన మాట్లాడారు. వేగవంతమైన సాంకేతిక అభివృద్ధి వల్ల సైబర్ సంబంధిత వివాదాలు, మోసాలు, బాధ్యత, పర్యవేక్షణకు సంబంధించిన ప్రశ్నలు మరింత జటిలమయ్యాయని తెలిపారు. న్యాయపరంగా నిర్ణయాత్మక ప్రక్రియలకు సాంకేతికత, కృత్రిమ మేధ సహాయపడగలవు. కానీ, అవి న్యాయ నిర్ణయ విశ్లేషణ, జవాబుదారీతనం, మానవ పర్యవేక్షణ స్థానాన్ని భర్తీ చేయలేవని స్పష్టం చేశారు.

ప్రత్యేక వివాదాల్లో మధ్యవర్తిత్వం, పరస్పర అంగీకారంతో కూడిన పరిష్కారాల ప్రాముఖ్యతను జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ కీలకంగా ప్రస్తావించారు. విధానపరమైన ముసాయిదా మధ్యవర్తిత్వం, స్వచ్ఛంద ఒప్పందాలకు టీడీశాట్ అవకాశం కల్పిస్తుందని... పార్టీలు సమర్థవంతమైన, పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారాలను పొందేందుకు సహాయపడుతుందని చెప్పారు.

# చెన్నై ఏకాభిప్రాయంతో బ్రిక్స్ ఎస్టీఐ సహకారంలో ప్రజా కేంద్రీకృత, మానవతా ప్రథమ దృక్పథానికి ప్రాధాన్యం

న్యూఢిల్లీ, ఆగష్టు 24:భారత్ అధ్యక్షతన జరిగిన 14వ బ్రిక్స్ సైన్స్ మంత్రుల సమావేశం ముగింపు సదస్సులో కేంద్ర శాస్త్ర-సాంకేతిక శాఖ, భౌగోళిక విజ్ఞాన శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), పీఎంవో-అణు ఇంధన-అంతరిక్ష విభాగం-సిబ్బంది, ప్రజా వ్యవహారాలు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ 'చెన్నై డిక్లరేషన్'ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రకటించారు. శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో సమర్థవంతమైన, స్థిరమైన, భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన వ్యవస్థను నిర్మించేందుకు బ్రిక్స్ దేశాల నిబద్ధతను ఈ ప్రకటన మరోసారి ధ్రువీకరిస్తుంది.

భారత్ బ్రిక్స్ అధ్యక్షతలో ఆమోదించిన 'చెన్నై ఏకాభిప్రాయం (చెన్నై కాన్సెన్సస్)' శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణల (ఎస్‌టీఐ) సహకారంలో ప్రజా కేంద్రీకృత, మానవతా ప్రథమ దృక్పథానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. సుస్థిర అభివృద్ధి, స్థిరమైన, నాణ్యమైన వృద్ధి, సామాజిక సమ్మిళితత్వంతో పాటు బ్రిక్స్ దేశాల ప్రజల సంక్షేమం, జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు ఆవిష్కరణలు, సాంకేతికతను వినియోగించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది.

కేంద్ర శాస్త్ర-సాంకేతిక శాఖ, భౌగోళిక విజ్ఞాన శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), పీఎంవో- అణు ఇంధన - అంతరిక్ష విభాగం - సిబ్బంది, ప్రజా వ్యవహారాలు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ప్రసంగిస్తూ..మరింత పటిష్టమైన, సమ్మిళితమైన, సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించడంలో శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని సమావేశంలో జరిగిన చర్చలు మరోసారి స్పష్టం చేశాయని అన్నారు. కృత్రిమ మేధ, హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ నుంచి క్వాంటం సాంకేతికతలు, అధునాతన పదార్థాలు, బయోటెక్నాలజీ, ఆరోగ్యం, వాతావరణం, సుస్థిరత వరకు జరిగిన ఈ చర్చల విస్తృతి, బ్రిక్స్ దేశాలు సమష్టి చర్యల ద్వారా పరిష్కరించగల ఉమ్మడి అవకాశా లను, సవాళ్లను ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు.

బ్రిక్స్ శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణల (ఎస్టీఐ) సహకారం మరింత పరిపక్వత, లోతును సాధిస్తోందని చెన్నై ఏకాభిప్రాయం పేర్కొంది. 14 అంశాలపై పనిచేస్తున్న వర్కింగ్ గ్రూపుల ద్వారా నిరంతర సహకారం కొనసాగుతోందని తెలిపింది. 11 బ్రిక్స్ యువ శాస్త్రవేత్తల వేదిక, బ్రిక్స్ యువ ఆవిష్కర్తల పురస్కారం తొమ్మిది సంచికలు, పరిశోధన, ఆవిష్కరణలు, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల దరఖాస్తుల ఆహ్వానాలతో కూడిన తొమ్మిది బ్రిక్స్ ఎస్టీఐ విధానాల కార్యక్రమాలను నిర్వహించినట్లు పేర్కొంది. బ్రిక్స్ ఎస్టీఐ భాగస్వామ్యంలో పెరుగుతున్న బలం, పెట్టుబడులు, నిరంతర భాగస్వామ్యానికి ఈ పురోగతి నిదర్శనమని డిక్లరేషన్ పేర్కొంది.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. భారత్ బ్రిక్స్ అధ్యక్షతకు నిర్దేశించిన "స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" ఇతివృత్తం కార్యరూపంలో కనిపించే భాగస్వామ్యాలు, బలమైన పరిశోధనా వ్యవస్థలు, శాస్త్రవేత్తల రాకపోకలకు మరిన్ని అవకాశాలు, ఉమ్మడి పరిశోధన మౌలిక వసతులు, యువ పరిశోధకులు, ఆవిష్కర్తలకు మరిన్ని అవకాశాలుగా మారాలని అన్నారు. బ్రిక్స్ శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణల (ఎన్‌టీఐ) ప్రాధాన్య తలను సమీక్షించి, వాటిని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను 'చెన్నై ఏకాభిప్రాయం' స్వాగతించింది. అలాగే భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన ఎస్టీఐ సహకార వ్యవస్థ కోసం జరుగుతున్న సంప్రదింపుల ప్రక్రియను కూడా నమోదు చేసింది.

మంత్రివర్గ సమావేశం నుంచి వెలువడిన ప్రధాన సహకార రంగాల్లో ఉమ్మడి పరిశోధనా మౌలిక వసతులు, మెగా-సైన్స్ ప్రాజెక్టులు ఉన్నాయి. పరిశోధనా మౌలిక వసతులు, మెగా-సైన్స్ ప్రాజెక్టులపై బ్రిక్స్ కార్యాచరణ బృందం సాధించిన ఫలితాలను చెన్నై ఏకాభిప్రాయం స్వాగతించింది. ఇందులో కార్యాచరణ ప్రణాళిక, టాస్క్‌ఫోర్స్ విధివిధానాలతోపాటు బ్రిక్స్ గ్లోబల్ రీసెర్చ్ అడ్వాన్స్‌డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నెట్‌వర్క్ (బ్రిక్స్ గ్రేయిన్)ను కార్యచరణలోకి తీసుకురావడంలో సాధించిన పురోగతిని కూడా పేర్కొంది. ఈ వ్యవస్థ ద్వారా పరిశోధన నదుపాయాలకు మెరుగైన ప్రాప్యత, వాటి వినియోగానికి ఉమ్మడి విధానాలు, పరిశోధకుల రాకపోకలు, భారీ స్థాయి పరిశోధనా మౌలిక వసతులపై మరింత బలమైన సహకారం సాధ్యమవుతుందని తెలిపింది.

ఈ కార్యాచరణ ప్రణాళిక ద్వారా పరిశోధన మౌలిక వసతులకు మెరుగైన ప్రాప్యత, సంయుక్త పరిశోధనలు, అధునాతన సాంకేతికతల అభివృద్ధి, పరిశోధకుల రాకపోకలు, సామర్థ్య నిర్మాణానికి ఆచరణాత్మక ప్రణాళికను అందిస్తుంది. ఇందులో బ్రిక్స్ గ్లోబల్ రీసెర్చ్ అడ్వాన్స్‌డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నెట్‌వర్క్ (బ్రిక్స్ గ్రేయిన్) ద్వారా చేపట్టే కార్యక్రమాలు కూడా ఉన్నాయి.

బ్రిక్స్ దేశాల మధ్య జ్ఞానాన్ని నిల్వ చేయడం, పంచుకోవడం కోసం ఒక క్రమబద్ధమైన వేదికగా బ్రిక్స్ శాస్త్ర, పరిశోధనల భాండాగారాన్ని కూడా చెన్నై ఏకాభిప్రాయం స్వాగతించింది. దీనికి సంబంధించిన ముసాయిదా రూపకల్పనలో శాస్త్రీయ సంస్థలు, పరిశోధకులు, పరిశోధన ఫలితాలు, డేటాసెట్లు, పరిశోధనా మౌలిక వసతులు, సహకార అవకాశాలను గుర్తించే డిజిటల్ ప్రజా వనరును ప్రతిపాదించారు. జాతీయ నిబంధనలు, డేటా పాలనకు సంబంధించిన అవసరాలకు అనుగుణంగా జ్ఞాన మార్పి, ఓపెన్ సైన్స్, బ్రిక్స్ దేశాల పరిశోధనా సామర్థ్యాలకు మరింత గుర్తింపును ప్రోత్సహిస్తుంది.

బ్రిక్స్ శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణల (ఎస్టీఐ) సహకారంలో ప్రజలు, ప్రతిభావంతుల అంశానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. యువ శాస్త్రవేత్తల మధ్య మరింత విస్తృతమైన పరస్పర మార్పిడులను చెన్నై ఏకాభిప్రాయం ప్రోత్సహించింది. అలాగే బ్రిక్స్ యువ శాస్త్రవేత్తల వేదిక, బ్రిక్స్ యువ ఆవిష్కర్తల పురస్కారం కింద కొనసాగుతున్న కార్యక్రమాలను స్వాగతించింది. బ్రిక్స్ ఎన్‌టీఐ పారిశ్రామిక భాగస్వామ్యం ద్వారా ఇంక్యుబేటర్లు, యాక్సిలరేటర్లు, ప్రారంభ దశ పెట్టుబడిదారుల మధ్య మరింత బలమైన భాగస్వామ్యం, యువ ఆవిష్కర్తలు, పరిశోధకుల రాకపోకలకు ఎక్కువ అవకాశాలు, సంబంధిత మార్కెట్లకు మెరుగైన ప్రాప్యత కల్పించడంలో పురోగతిని కూడా గుర్తించింది.

డిక్లరేషన్‌లో బ్రిక్స్ యువ అంకుర సంస్థల వేదికను కూడా స్వాగతించారు. ప్రారంభ, అభివృద్ధి దశలో ఉన్న అంకుర సంస్థలకు ఆర్థిక సహకారాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తించారు. అలాగే అవసరమైన సందర్భాల్లో శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణల విభాగంతో సమన్వయం చేసుకుంటూ బ్రిక్స్ అంకుర సంస్థల ఆవిష్కరణల నిధిని ఏర్పాటు చేసే అంశాన్ని బ్రిక్స్ పరిశ్రమల మంత్రుల డిక్లరేషన్‌లో పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. బ్రిక్స్ శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణల భాగస్వామ్యం నిరంతర చర్చలకు మాత్రమే పరిమితం కాకుండా, స్పష్టమైన ఫలితాలను అందించే దిశగా ముందుకు సాగాలని అన్నారు. సంయుక్త ప్రాజెక్టులు, ఉమ్మడి వేదికలు, సమన్వయంతో కూడిన పరిశోధనా ప్రతిపాదనల ఆహ్వానాలు, అందరికీ అందుబాటులో ఉండే పరిశోధనా మౌలిక వసతుల కోసం మరింత బలమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. బ్రిక్స్ విస్తరిస్తూ పరిణామం చెందుతున్న నేపథ్యంలో, దాని శాస్త్ర, సాంకేతిక సహకారం అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాధాన్య తలకు అనుగుణంగా, సమ్మిళితం గా, స్పందనాత్మకంగా ఉండాలని అన్నారు. అత్యాధునిక సాంకేతికతలు అందరికీ అందుబాటులో, తక్కువ ధరల్లో, బాధ్యతాయుతంగా ఉండేలా చూడటంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా వాటిని వినియోగించాలని పేర్కొన్నారు.

చెన్నై ఏకాభిప్రాయం ఈ దృక్పథాన్ని పలు అభివృద్ధి చెందుతున్న, వ్యూహాత్మక రంగాలకు విస్తరించింది. హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, బయోటెక్నాలజీ, మానవ ఆరోగ్యం, పదార్థ శాస్త్రం, నానో సాంకేతికత, ఫోటోనిక్స్, ఖగోళ శాస్త్రం, భౌగోళిక సమాచార సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధనం, సముద్ర, ధ్రువ శాస్త్రం, ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ, సామాజిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలు ఇందులో ఉన్నాయి. క్వాంటమ్ సాంకేతికతలలో కొనసాగుతున్న సహకారాన్ని కూడా డిక్లరేషన్ స్వాగతించింది. శాస్త్రవేత్తలు, విద్యాసంస్థలు, ఆవిష్కరణల రంగానికి చెందిన వర్గాల మధ్య ఆచరణాత్మక భాగస్వామ్యం, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులను ప్రోత్సహించింది.

ఈ మంత్రివర్గ సమావేశం 2026?2027 సంవత్సరాలకుగానూ బ్రిక్స్ ఎస్టీఐ కార్యకలాపాల క్యాలెండర్‌ను ఆమోదించింది. ఇది వర్కింగ్ గ్రూప్‌లు, స్టీరింగ్ కమిటీ, సీనియర్ అధికారుల సమీక్షలు, యువ శాస్త్రవేత్తల వేదిక, బ్రిక్స్ యువ ఆవిష్కర్తల పురస్కారం వంటి వివిధ విభాగాలు, కార్యక్రమాల నిరంతర నిర్వహణకు సహకరిస్తుంది. చెన్నై ఏకాభిప్రాయం ద్వారా తదుపరి బ్రిక్స్ ఎస్టీఐ మంత్రుల బాధ్యతల బదిలీ నమోదు కాగా, 2027లో చైనా అధ్యక్షతన తదుపరి సమావేశం జరగనుంది.

బ్రిక్స్ మంత్రులు, ప్రతినిధి బృందాలు, నిపుణులు, సహచరులు మంత్రి స్థాయి సమావేశానికి అందించిన సహకారాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసించారు. భారత్ బ్రిక్స్ శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణల అధ్యక్షతను అర్థవంతంగా, ఫలితాల ఆధారంగా తీర్చిదిద్దడంలో శాస్త్ర, సాంకేతిక శాఖ, భాగస్వామ్య సంస్థలు చేసిన కృషిని ఆయన అభినందించారు. స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత అనే స్ఫూర్తి బ్రిక్స్‌ను శాస్త్రీయ ప్రతిభ, సాంకేతిక పురోగతి, సమష్టి సుసంపన్నతకు వేదికగా ముందుకు నడిపించాలని డాక్టర్ జితేంద్ర సింగ్ ఆకాంక్షించారు.

Ministry of Culture
Government of India

సాహిత్య అకాడెమీ
ఆధ్వర్యంలో
నా దృష్టిలో...
కార్యక్రమానికి అందరికి స్వాగతం
అందెశ్రీ
ప్రసిద్ధ తెలుగు కవి, గీత రచయిత
జీవితం, సృజనాత్మక రచనలపై
దేశపతి శ్రీనివాస్
తెలుగు గీత రచయిత, గాయకుడు
ప్రసంగిస్తారు
గురువారం, 27 ఆగస్ట్ 2026, సాయంత్రం 5.30 గంటలకు
కాన్ఫరెన్స్ హాల్, రవీంద్ర భారతి, హైదరాబాద్
Phone : 080-22245152
Email : secretary@sahitya-akademi.gov.in / rs.rob@sahitya-akademi.gov.in
Website : https://sahitya-akademi.gov.in

# పేదలకు అన్యాయం చేస్తే ఊరుకోం

కరీంనగర్, ఆగష్టు 24: ఏళ్లుగా పేదలు నివసిస్తున్న భూములను లాక్కోవాలని చూస్తే ఊరుకునేది లేదని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్ నగరంలోని రేకుర్తి, కొత్తపల్లి ప్రాంతాల్లో గత 40 ఏళ్లుగా నివసిస్తున్న పేద ప్రజల భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బాధితులతో కలిసి కరీంనగర్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూములను కోల్పోతున్న పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పేదల భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

రేకుర్తి, కొత్తపల్లి ప్రాంతాల్లో ఏళ్లుగా పేదలు నివసిస్తూ ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్నారని గంగుల కమలాకర్ తెలిపారు. అలాంటి భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి పేదలకు ఇబ్బందులు కలిగించడం సరికాదని అన్నారు.

# మారిషస్ ఇంధన భద్రతను పటిష్టం చేస్తూ పలు ఒప్పందాలు ఖరారు

న్యూఢిల్లీ, ఆగష్టు 24:కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరీ 2026 ఆగస్టు 20, 21 తేదీల్లో మారిషస్ దేశంలో అధికారిక పర్యటన చేపట్టారు.

ఆగస్టు 20న మారిషస్ ప్రధానమంత్రి డాక్టర్ నవీంచంద్ర రామ్‌గూలామ్‌తో కేంద్రమంత్రి భేటీ అయ్యారు. వారి సమక్షంలో చమురు, సహజ వాయువు రంగంలో సహకారానికి భారత్, మారిషస్ ప్రభుత్వాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. అలాగే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్), మారిషస్ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ (ఎస్‌టీసీ) మధ్య పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాకు సంబంధించి దీర్ఘకాలిక కొనుగోలు అమ్మకాల ఒప్పందం కూడా కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం మారిషస్ దిగుమతి చేసుకునే మోటార్ స్పిరిట్ (ఎంఎస్), హై స్పీడ్ డీజిల్ (హెచ్ఎస్‌డీ), ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) మొత్తం అవసరాలను ఐఓసీఎల్ సరఫరా చేయనుంది.

చమురు, సహజ వాయువు రంగంలో కుదిరిన ఈ అవగాహన ఒప్పందం ఇరు దేశాల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఇంధన భాగస్వామ్యానికి సంస్థాగత రూపాన్ని కల్పిస్తుంది. ఇందులో పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా, మారిషస్ అధికారులకు శిక్షణ, సామర్థ్య నిర్మాణం, జీవ ఇంధనాల రంగంలో సహకారం వంటి అంశాలు ఉన్నాయి. ఐఓసీఎల్, ఎస్‌టీసీ మధ్య కుదిరిన అయిదేళ్ల ఒప్పందం ద్వారా మారిషస్‌కు దీర్ఘకాలికంగా హామీతో కూడిన ఇంధన సరఫరా లభించడంతో పాటు, సరఫరా భద్రత కల్పిస్తుంది. ధరల్లో హెచ్చుతగ్గుల ప్రభావం నుంచి కూడా ఈ ఒప్పందం మారిషస్‌ను రక్షించనుంది. ఇటీవలి సంవత్సరాల్లో దక్షిణాసియా వెలుపల భారత ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థ కుదుర్చుకున్న తొలి దీర్ఘకాలిక సరఫరా ఒప్పందం ఇదే.

పర్యటనలో భాగంగా ఇంధనం, ప్రజా వినియోగ సేవల శాఖ మంత్రి ప్యాట్రిక్ గెర్వైస్ అసిర్వాడెన్.. వాణిజ్యం, వినియోగదారుల రక్షణ శాఖ మంత్రి జాన్ మైఖేల్ ట్జూన్ సావో యెంగ్ సిక్ యుయెన్.. విదేశాంగ, ప్రాంతీయ సమైక్యత, అంతర్జాతీయ వాణిజ్య శాఖ మంత్రి ధనంజయ్ రామ్‌ఫుల్‌తో కేంద్రమంత్రి శ్రీ పూరి ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. అలాగే పోర్ట్ లూయిస్‌లోని మెర్ రూజ్ వద్ద ఇండియా ఆయిల్ (మారిషస్) లిమిటెడ్‌కు చెందిన 27.5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల బంకర్ మెరైన్ ఇంధన నిల్వ సదుపాయానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రపంచంలోనే ప్రధాన చమురు శుద్ధి కేంద్రంగా భారత్ ఎదిగింది. దేశంలోని 23 శుద్ధి కర్మాగారాల ద్వారా ఏటా 267 మిలియన్ మెట్రిక్ టన్నుల శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తూ, శుద్ధి చేసిన ఉత్పత్తుల విషయంలో నికర ఎగుమతిదారుగా భారత్ నిలిచింది. ఇప్పటికే నేపాల్, భూటాన్‌ల పెట్రోలియం అవసరా లను భారత్ తీరుస్తుండగా, ప్రాంతీయంగా, ఇతర దేశాలకు కూడా గణనీయమైన పరిమాణంలో సరఫరా చేస్తోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం సమయంలోనూ నేపాల్, భూటాన్‌లకు తన సరఫరా హామీలను భారత్ నెరవేర్చింది. తద్వారా ఈ ప్రాంతానికి విశ్వసనీయ ఇంధన భద్రతా భాగస్వామిగా భారత్ నిలిచింది. మారిషస్‌తో కుదిరిన ఒప్పందం ద్వారా ఆ దేశానికి ప్రధాన ఇంధన సరఫరాదారుగా భారత్ స్థానం బలోపేతం కావడంతో పాటు, హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్ వ్యూహాత్మక, ఆర్థిక ప్రభావం మరింత విస్తరించనుంది.

# ఎల్లంపల్లి, నిజాంసాగర్ ప్రాజెక్టుల్లో పెరుగుతున్న నీటి నిల్వ

ఆదిలాబాద్, ఆగష్టు 24: తెలంగాణలో కురుస్తున్న వర్షాల ప్రభావంతో పలు ప్రాజెక్టులకు వరద ప్రవాహం కొనసాగుతోంది. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుతో పాటు కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టుకు కూడా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహంతో రెండు ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు పెరుగుతున్నాయి.

పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ప్రస్తుతం 6,244 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 20.17 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.89 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 146.80 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు నుంచి 406 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగితే ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉంది.

నిజాంసాగర్‌కు 3,185 క్యూసెక్కుల వరద

కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టుకు కూడా వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 3,185 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు కాగా, ప్రస్తుతం 1,401.06 అడుగుల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 17.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 12.54 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రాష్ట్రంలో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టులకు వస్తున్న వరద ప్రవాహాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే నీటి మట్టాలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో పరిస్థితిని అధికారులు నిశితంగా గమనిస్తున్నారు.

# చలో హైదరాబాద్ కు తరలిన ములుగు జిల్లా సిపిఎస్ ఉద్యోగులు



ములుగు ఆగష్టు 24:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదులో తలపెట్టిన జన జాగరణ యాత్ర బహిరంగ సభ కార్యక్రమానికి ములుగు జిల్లా కేంద్రం నుండి సుమారు 500 మంది ఉద్యోగులు హైదరాబాద్ కు బయలుదేరడం జరిగింది.

తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగుల సంఘం (యాఅఖూఇజ) ములుగు జిల్లా అధ్యక్షులు అన్నవరం రవికాంత్ ప్రధాన కార్యదర్శి మంకిడి రవి రాష్ట్ర కార్యదర్శి గుల్ల గట్టు సంజీవ ఆధ్వర్యంలో భారీ ఎత్తున 4 బస్సులు 12 కార్లలో బయలుదేరడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జన జాగరణ యాత్ర బహిరంగ సభ తో ప్రభుత్వం దిగివచ్చి సిపిఎస్ ని రద్దుచేసి పాత పెన్షన్ ని పునరుద్ధరింప చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగుల సంఘం ములుగు జిల్లా గౌరవ అధ్యక్షులు కంచు ప్రభాకర్, డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగ నరేందర్ కుమార్,, ఖీజఖఖూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్, సిపిఎస్ ఉద్యోగుల సంఘం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మహి పవన్, కార్యదర్శి నరేష్, వాజేడు మండల అధ్యక్షులు స్వరూప్ సింగ్, మంగపేట మండల అధ్యక్షులు సనప శ్రీధర్, నాయకులు మాలోతు రాజు, సోలం వెంకటేశ్వర్లు, కాక సమ్మయ్య, బిక్ష పతి, మక్బుల్ పాషా , ఫార్మసీ ఉద్యోగుల సంఘం నాయకులు సిద్ధబోయిన వెంకట్, స్వామి, వనజ , మహేష్, వైనాల స్వామి, మరియు వివిధ మండలాల ఉద్యోగులు నాయకులు పాల్గొన్నారు

# మైనార్టీ మహిళల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

## -ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం

కరీంనగర్, ఆగష్టు 24: మైనార్టీ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం తెలిపారు. ఇందిరా మైనార్టీ మహిళా యోజన పథకం కింద కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన రేష్మ, షాబాన బేగంలకు మంజూరైన రూ.50 వేల చొప్పున 100 శాతం సబ్సిడీ చెక్కులను ఆదివారం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.

అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోగురి భూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చలన చిత్రోత్సవ ఏర్పాట్ల సమీక్ష కోసం 57వ ఇఫి స్టీరింగ్ కమిటీ తొలి సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 24:గౌరవ సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ అధ్యక్షతన న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్-2లో ఆగస్టు 21, 2026న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫి) స్టీరింగ్ కమిటీ మొదటి సమావేశం జరిగింది. చలన చిత్రోత్సవ రాబోయే ఎడిషన్‌కు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించేందుకు, ప్రపంచ స్థాయి అంతర్జాతీయ చలన చిత్రోత్సవంగా ఇఫి స్థానాన్ని మరింత బలోపేతం చేయటానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు.

57వ అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవం (ఇఫి) నవంబర్ 20 నుంచి 28, 2026 వరకు గోవాలో జరుగుతుంది.

ఈ సమావేశం సందర్భంగా డాక్టర్ ఎల్. మురుగన్ మాట్లాడుతూ... 57వ ఇఫి వేడుకపై దృక్పథాన్ని వివరించారు. యువ విద్యార్థులకు, నూతన సినీ రూపకర్తలకు భారత చలనచిత్ర పరిశ్రమలో వెలుగులోకి రాని ప్రతిభావంతులకు మరిన్ని అవకాశాలు కల్పించటంపై ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. యువ ప్రతిభావంతుల సృజనాత్మకతను ప్రదర్శించేందుకు, నిపుణులైన సినీ రూపకర్తల నుంచి నేర్చుకునేందుకు, ప్రపంచ చలనచిత్ర వర్గాలతో అనుసంధానమయ్యేందుకు వేదికగా ఇఫి నిలవాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ చిత్రాలను, ప్రముఖ సృజనాత్మక ప్రతిభను భారత్‌లో ప్రదర్శించటం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఉనికిని మరింత బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు.

భారతదేశంలో ఆరెంజ్ ఎకానమీని ప్రోత్సహించటానికి, దేశంలోని సృజనాత్మక పరిశ్రమలను బలోపేతం చేయటానికి శ్రీ అశ్విని వైష్ణవ్ నాయకత్వంలోని మంత్రిత్వ శాఖ నూతన కార్యక్రమాలను చేపడుతోందని డాక్టర్ మురుగన్ స్పష్టం చేశారు. ఇది ప్రతిభకు, ఆవిష్కరణలకు, ప్రపంచ స్థాయి భాగస్వామ్యాలకు అద్భుతమైన అవకాశాలను సృష్టిస్తోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకారం, వృత్తిపరమైన మార్పిడికి తగిన మార్గాలను బలోపేతం చేస్తూ భారతీయ సినీ వైవిధ్యాన్ని, శక్తిని ప్రపంచానికి చాటిచెప్పాల్సిన ప్రాముఖ్యతను తెలిపారు.

ఇఫి అభివృద్ధిలో, దాని నిరంతర విజయంలో గోవా ప్రభుత్వ కీలక పాత్రను గుర్తించిన మంత్రి... గోవా మాజీ ముఖ్యమంత్రి దివంగత శ్రీ మనోహర్ పారికర్ వారసత్వాన్ని స్మరించుకున్నారు. అంతర్జాతీయ చలన చిత్రాలకు గోవాను ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా మార్చటంలో ఆయన దూరదృష్టి ఎంతగానో దోహదపడిందని కొనియాడారు. ఇఫిని అత్యుత్తమ ప్రపంచ స్థాయి సాంస్కృతిక వేదికగా తీర్చిదిద్దేందుకు నిరంతరం మద్దతిస్తున్న గోవా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ప్రమోద్ సావంత్ కృషినీ ఆయన అభినందించారు.

ఈ వేడుక సందర్భంగా సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్ మాట్లాడుతూ... అభివృద్ధి చెందుతున్న భారత సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు ప్రచారం కల్పించేందుకు, భారత, అంతర్జాతీయ సృజనాత్మక వర్గాల మధ్య సహకారాన్ని మరింత పెంపొందించేందుకు ఇఫిని ప్రధాన వేదికగా వినియోగించుకోవాలన్నారు. ఈ చిత్రోత్సవానికి హాజరయ్యే సినీ రూపకర్తలు, సినీ ప్రియులు, ప్రతినిధులు, అతిథులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అత్యుత్తమ, నాణ్యమైన అనుభూతిని అందించాల్సిన ప్రాముఖ్యతను ఆయన తెలియజేశారు.

57వ ఇఫి ఏర్పాట్లు, చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై ఎన్ఎఫ్‌డీసీ ఎండీ శ్రీ ప్రకాశ్ మగ్దుమ్ ప్రజెంటేషన్ ఇచ్చారు. స్టీరింగ్ కమిటీ సిఫార్సులను ఇఫి ఫెస్టివల్ డైరెక్టర్ శ్రీ అశుతోష్ గోవారికర్ స్వాగతించారు. మాస్టర్ క్లాసులను బలోపేతం చేయటం, యువ సినీ రూపకర్తలకు అవకాశాలు కల్పించటం, భారత్, విదేశాల నుంచి అత్యుత్తమ చిత్రాలను ఎంపిక చేయటం, భారత్, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సినీ రూపకర్తలు, సృజనాత్మక ప్రముఖుల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన ప్రాముఖ్యతను ఆయన స్పష్టం చేశారు.

గోవా ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్ల గురించి కమిటీకి ఆ రాష్ట్ర ప్రభుత్వ ఐపీఆర్ కార్యదర్శి వివరించారు. అవసరమైన అన్ని కార్యక్రమాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు, 57వ ఇఫి ఏర్పాట్లు సజావుగా సాగేలా అన్ని ప్రయత్నాలు చేస్తామని హామీ ఇచ్చారు.

ఇఫికి విస్తృతమైన అంతర్జాతీయ ప్రచారం కల్పించేందుకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ చిత్రాలను ఎంపిక చేసేందుకు, వివిధ దేశాల నుంచి ప్రముఖ సినీ రూపకర్తలు, కళాకారులు, సృజనాత్మక నిపుణులను ఆహ్వానించేందుకు స్టీరింగ్ కమిటీ సభ్యులు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు.

# వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ నేతృత్వంలో జపాన్ కు 200మంది సభ్యుల భారత వాణిజ్య ప్రతినిధివర్గం

న్యూఢిల్లీ, ఆగష్టు 24: జపాన్‌లోని టోక్యో, నగోయా, ఒసాకాలలో 2026 ఆగష్టు 24 నుంచి నుండి 27 వరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పర్యటించనున్నారు. తయారీ, సెమీకండక్టర్లు, స్వచ్ఛ ఇంధనం, ఉక్కు నుంచి ఆటోమోటివ్, ఆర్థిక సేవలు, ఆరోగ్య సంరక్షణ, అంకుర పరిశ్రమల వరకు విస్తరించిన వివిధ రంగాలకు చెందిన 200 మందికి పైగా వ్యాపార ప్రతినిధులతో కూడిన భారత అతిపెద్ద వాణిజ్య ప్రతినిధి బృందానికి శ్రీ గోయల్ నాయకత్వం వహిస్తున్నారు. ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యం పట్ల ఇరు దేశాలకు ఉన్న ఉన్నతమైన ఆకాంక్షలను ఈ పర్యటన ప్రతిబింబిస్తుంది. భారత్, జపాన్ తమ వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భావిస్తున్న తరుణంలో ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

టోక్యో పర్యటనలో భాగంగా. భారత అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా ఉన్న ప్రముఖ జపనీస్ బహుళజాతి సంస్థలు, పారిశ్రామిక సంస్థల అగ్ర నాయకత్వంతో మంత్రి వరుస సమావేశాలు నిర్వహించ నున్నారు. 1,500 పైగా ప్రముఖ జపనీస్ కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తు న్న అగ్రగామి సంస్థ కైడాన్‌రెన్ (జపాన్ బిజినెస్ ఫెడరేషన్) తో రౌండ్ టేబుల్ సమావేశం కూడా జరగనుంది. పెట్టుబడులు, ఆవిష్కరణలకు గమ్యస్థానంగా భారతదేశానికి పెరుగుతున్న ఆదరణను ప్రతిబింబిస్తూ, సెమీ కండక్టర్లు, కృత్రిమ మేధ, అంకు ర పరిశ్రమలు, విదేశీ పెట్టు బడిదారులతో సంబంధాలపై ప్రత్యేక చర్చా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. జపాన్ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల మంత్రి అకాజావా రియోసేతో శ్రీ గోయల్ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. జపాన్‌లో నివసిస్తున్న భారతీయ వర్గాలతో సంభాషించడంతో పాటు జపాన్ ప్రభుత్వానికీ, పార్లమెంటుకూ చెందిన సీనియర్ సభ్యుల తో కూడా సమావేశమవుతారు.

సెంట్రల్ జపాన్ పారిశ్రామిక కేంద్రమైన నగోయాలో, చుకేరెన్ (సెంట్రల్ జపాన్ ఎకనామిక్ ఫెడరేషన్), నగోయా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులతో కలిసి మంత్రి రోడ్‌షోకు నాయకత్వం వహిస్తా రు. ఆటోమోటివ్, ఉక్కు రంగా ల్లోని ప్రధాన తయారీ రంగ పెట్టు బడిదారులతోనూ, ఐచి ప్రిఫెక్చర్ నాయకులతోనూ సమావేశమవుతారు. ఒసాకాలో ఇన్వెస్టర్స్ అండ్ బిజినెస్ రోడ్‌షోతో పాటు ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక, వినియోగదారుల రంగాలకు చెందిన ప్రముఖ జపనీస్ కంపెనీలతో జరిగే సమావేశాలతో పర్యటన ముగుస్తుంది. భారత తయారీ, స్వచ్ఛ ఇంధనం, వినియోగదారుల మార్కెట్లలోని అవకాశాలను ప్రదర్శించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పెట్టుబడులు, సాంకేతికత, పారిశ్రామిక సహకారంలో భారత్‌కు అత్యంత విశ్వసనీయ భాగస్వాములలో జపాన్ సుస్థిర స్థానం కలిగివుంది. భారత ఆటోమోటివ్, ఉక్కు, ఎలక్ట్రానిక్స్, ఆర్థిక సేవలు, మౌలిక సదుపాయాల రంగాలలో జపనీస్ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వివిధ రంగాలకు చెందిన 200 మందికి పైగా ప్రతినిధులతో కూడిన వ్యాపార బృందాల అసాధారణ భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ పర్యటన రెండు దేశాల ద్వైపాక్షిక వాణిజ్య, పెట్టుబడి సంబంధాలకు నూతన ఉత్తేజాన్ని ఇస్తుందని భావిస్తున్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధనకు దోహదపడే కీలకమైన అత్యున్నత సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత తయారీ రంగంలోనూ, తదుపరి తరం పరిశ్రమలలోనూ సహకారానికి కొత్త మార్గాలను సుగమం చేస్తుందని కూడా భావిస్తున్నారు

# పలు కుటుంబాలను పరామర్శించిన సండ్ర

## -వివిధ గ్రామాల్లో పర్యటించి మృతుల కుటుంబాలకు పరామర్శ



ఖమ్మం, ఆగష్టు 24:మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. వేంసూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు జాబిశెట్టి కోటేశ్వరరావు మాతృమూర్తి రుక్మిణమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతి తెలిపారు.

కుటుంబ సభ్యులను ఓదార్చి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చౌడవరం గ్రామానికి వెళ్లిన సండ్ర వెంకట వీరయ్య ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన నాగనబోయిన నరేష్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా ఆయా కుటుంబాల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు పార్టీ తరపున అండగా ఉంటామని తెలిపారు. సండ్ర వెంకట వీరయ్య వెంట పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సండ్రను కలిసి స్థానిక పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# మిర్యాలగూడలో ఘనంగా వరుణ యాగం

## -సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే బీఎల్ఆర్ ఆకాంక్ష

నల్గొండ, ఆగష్టు 24: మిర్యాలగూడ పట్టణంలోని శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో సోమవారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరుణ యాగం ఘనంగా నిర్వహించారు. యాగానికి ఖానాపూర్ ఎమ్మెల్యే భక్తుల లక్ష్మారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహస్ర ఘటాభిషేకంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని, రైతులు పంటల సాగుతో సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు కర్నాటి రమేష్, బండారు కుశలయ్య, గౌరు శ్రీనివాస్, వెంకటరమణ చౌదరి, ధనుంజయ, గోళ్ళ రామశేఖర్, గందె రాము, వ్యాపారవేత్తలు కృష్ణయ్య, మట్టయ్య, ప్రసాద్, నాగేశ్వరరావు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మండలస్థాయి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి..

## -ప్రజల సమస్యల పరిష్కారానికి మండల కార్యాలయాల్లో ప్రజావాణి



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 24:(నేటినిజం ప్రతినిధి): అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే మండలస్థాయి ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతోపాటు ఆయా రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతోందని తెలిపారు. ఇందులో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండలస్థాయి అధికారుల హాజరును పరిశీలించారు.

గత వారం నిర్వహించిన ప్రజావాణికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిలో ఎన్ని పరిష్క రు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చేయూత నూతన పింఛన్ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే వివరాలను సైతం అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పరిశీలించారు. చేయూత పింఛన్ కోసం అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాలను రెవెన్యూ అధికారులు త్వరితగతిన అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతోపాటు ఆయా రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు. ఆయా మండలాల ప్రజలు తమ మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రజావాణి వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, డిప్యూటీ తహసీల్దార్ వేణు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిరుతపులి చర్మం, గోర్లు విక్రయించేందుకు ప్రయత్నం

## -నలుగురు వ్యక్తుల అరెస్ట్.. 17 గోర్లు, చర్మం స్వాధీనం



ఖమ్మం, ఆగష్టు 24:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిరుతపులి చర్మం, గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు వ్యక్తులను బూర్గంపహాడ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఈ. నాగబిక్షం, టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం తాళ్లగొమ్మూరు గ్రామంలోని అనిల్ అనే వ్యక్తి ఇంటి వద్ద చిన్న బ్యాగ్‌తో అనుమానాస్పదంగా ఉన్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో చిరుతపులి చర్మం, గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు.

పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. నిందితులు గత ఏడాది వేసవిలో చింతూరు మండలం గమ్మలకోట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గుంతలో పడి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్న చిరుతపులిని రాళ్లు, కర్రలతో కొట్టి, భాణాలు విసిరి చంపినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం చిరుతపులి చర్మం, గోర్లను తొలగించి, చర్మాన్ని ఎండబెట్టి, గోర్లను భద్రపరిచి ఉంచినట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. అనంతరం వాటిని విక్రయించి డబ్బు సంపాదించేందుకు నిందితులు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు.

ఈ క్రమంలో సారపాకకు చెందిన చల్లా అనిల్‌కుమార్ వ్యవసాయం చేసేందుకు భూమిని కౌలుకు తీసుకునే ఉద్దేశంతో గమ్మలకోట గ్రామానికి చెందిన కుంజా భద్రయ్యను సంప్రదించినట్లు పోలీసులు తెలిపారు. చిరుతపులి చర్మం, గోర్లను విక్రయించేందుకు కొనుగోలుదారులను సంప్రదించి సహకరిస్తానని అనిల్‌కుమార్ చెప్పినట్లు పేర్కొన్నారు. దీంతో కుంజా భద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్య ముగ్గురు కలిసి చిరుతపులి చర్మం, గోర్లను చిన్న బ్యాగ్‌లో పెట్టుకుని తాళ్లగొమ్మూరులోని అనిల్‌కుమార్ ఇంటికి తీసుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు. విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

నిందితుల వద్ద నుంచి ఎండిన స్థితిలో ఉన్న ఒక చిరుతపులి చర్మం, 17 గోర్లు, వాటిని తరలించేందుకు ఉపయోగించిన ఒక చిన్న బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తెలిపారు. పట్టుబడిన వారిలో చల్లా అనిల్ కుమార్ తాళ్లగొమ్మూరు గ్రామం, సారపాక, బూర్గంపహాడ్ మండలానికి చెందిన వ్యక్తిగా, కుంజా భద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్యలు చింతూరు మండలం గమ్మలకోట గ్రామానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు.

నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. వన్యప్రాణులను వేటాడటం, వాటి అవయవాలను అక్రమంగా విక్రయించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్‌కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, టాస్క్‌ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్ఐలు నాగబిక్షం, ప్రవీణ్, సుమంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వికసిత్ భారత్-2047 లక్ష్యసాధనలో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో యువతకు భవిష్యత్తు నైపుణ్యాలను అందించడమే కీలకం: శ్రీ జయంత్ చౌదరి

న్యూ ఢిల్లీ, ఆగష్టు 24:భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డీఈ) మార్గదర్శకత్వంలో, అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) సహకారంతో దేశవ్యాప్త క్లౌడ్, ఏఐ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ), కల్టస్ ఎడ్యుకేషన్ ప్రకటించాయి. ఏడబ్ల్యూఎస్ డిజిటల్ ట్రైనింగ్ కంటెంట్ ద్వారా 1,50,000 మందికి ప్రాథమిక ఏఐ, క్లౌడ్ శిక్షణ అందిస్తుంది. అలాగే 10,000 మందికి ఏడబ్ల్యూఎస్ రీ/స్టార్ట్ ప్రోగ్రామ్ ద్వారా ఉద్యోగ సాధనకు తగిన శిక్షణను అందిస్తుంది. బృందాల వారీగా అందించే ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమమే ఏడబ్ల్యూఎస్ రీ/స్టార్ట్. ఇది క్లౌడ్ కంప్యూటింగ్ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి సహాయపడటంతో పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాలను అందిస్తుంది. అర్హతలకు తగిన ఇంటర్వ్యూ అవకాశాలను పట్టభద్రులకు ఇస్తుంది.

ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే కార్యక్రమాలుగా ఏడబ్ల్యూఎస్, రీ/స్టార్ట్, ఏడబ్ల్యూఎస్ డిజిటల్ ట్రైనింగ్ కంటెంటును ఎన్ఎస్‌డీసీ, కల్టస్ ఉపయోగిస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన శిక్షణ కార్యక్రమానికి పరిమిత స్థాయిలో మాత్రమే అందుబాటులో ఉండటం, సాంకేతిక సంస్థలతో అనుసంధానం తక్కువగా ఉండటం, క్లౌడ్, ఏఐ ఉద్యోగాలకు పోటీ పడేందుకు అవసరమైన అర్హతలు లేకపోవడం లాంటి సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించనున్నారు. ఎన్ఎస్‌డీసీ ఎంపిక చేసిన భాగస్వామ్య సంస్థ కల్టస్ ద్వారా ఈ కార్యక్రమాన్ని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ శిక్షణ అందిస్తారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు చెందిన యువతకు ప్రాధాన్యం లభిస్తుంది. జాతీయ స్థాయి హ్యాకథాన్‌తో ఈ శిక్షణా కార్యక్రమం ముగుస్తుంది.

కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), విద్యా శాఖ సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌదరి ఈ సందర్భంగా మాట్లాడారు. “ప్రాంతాలు, నేపథ్యాలతో సంబంధం లేకుండా అందరికీ సమాన అవకాశాలు అందించాలనే వికసిత్ భారత్ లక్ష్యాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తోంది. ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రతిభకు అంతర్జాతీయ కేంద్రంగా భారత్ ఎదుగుతున్న తరుణంలో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో యువత కూడా భవిష్యత్తు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకొనే అవకాశాలను పొందడం చాలా అవసరం. సమ్మిళితమైన, నైపుణ్యాలున్న, భవిష్యత్తు అవసరాలకు తగిన శ్రామిక శక్తిని తీర్చిదిద్దడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయి. వికసిత్ భారత్?2047 లక్ష్య సాధనలో భాగంగా చేసే ప్రయాణంలో ఇది చాలా ముఖ్యమైనది” అని శ్రీ జయంత్ చౌదరి అన్నారు.

”ఏడబ్ల్యూఎస్ రీ/స్టార్ట్ కార్యక్రమం ప్రతిభావంతులను వెలికి తీసి ఉపాధి కల్పిస్తుంది. క్లౌడ్ సంస్థల్లో విజయవంతంగా కెరీర్ ప్రారంభించడానికి, తగిన ప్రతిభతో సంస్థలు తమ పోటీతత్వాన్ని పెంపొందించుకోవడానికి, సమాజం వృద్ధి చెందడానికి ఈ వేదిక దోహదపడుతుంది. భవిష్యత్తుకు తగినట్లుగా వైవిధ్యమైన, విస్తృతమైన నైపుణ్యాలున్న క్లౌడ్ నిపుణులను తయారు చేసేందుకు, ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ ద్వారా సంస్థలు ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి ఎన్ఎస్‌డీసీ, కల్టస్ ఎడ్యుకేషన్‌తో కలసి పని చేస్తున్నందుకు గర్విస్తున్నాం” అని ఏడబ్ల్యూఎస్ స్కిల్లింగ్, సోషల్ ఇంపాక్ట్ ఏపీజేసీ లీడ్ రాణీ బర్ఛమోర్ అన్నారు.

“ఆత్మవిశ్వాసాన్ని, అర్హతలను, సరైన ఉపాధి అవకాశాలను అందించే విద్యే నైపుణ్యానికి అసలైన కొలమానం. ప్రధాన మెట్రో నగరాల పరిధిని దాటి అంతర్జాతీయంగా అవసరమైన క్లౌడ్, ఏఐ నైపుణ్యాలను అందించి... నేర్చుకోవడం, శిక్షణ దగ్గరి నుంచి సర్టిఫికేషన్, ఉద్యోగ అవకాశాల వరకు ఫలితాల ఆధారిత ప్రయాణ మార్గాన్ని ఏర్పాటు చేయడంపైనే దృష్టిని సారించాం” అని కల్టస్ ఎడ్యుకేషన్, గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ నళిన్ సింగ్ తెలియజేశారు.

దేశవ్యాప్తంగా ఉన్న యువతకు అత్యుత్తమ సాంకేతిక శిక్షణ, ఉపాధి అవకాశాలను చేరువ చేస్తూ.. సామాజికంగా, ఆర్థికంగా అర్థవంతమైన ప్రభావం తీసుకొచ్చేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ముఖ్యంగా నైపుణ్యాలు ఉండి వెనుకబడిన ప్రాంతాల్లోని యువతకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న యువతకు ముఖ్యంగా వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న ప్రతిభా కేంద్రాల్లోని యువతకు నాణ్యమైన సాంకేతిక శిక్షణ, ఉపాధి అవకాశాలను విస్తరించడం ద్వారా అర్థవంతమైన సామాజిక, ఆర్థిక ప్రభావాన్ని తీసుకొచ్చేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. పూర్తిగా 100 శాతం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో మెట్రోపాలిటన్ నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని యువత శిక్షణ పొందవచ్చు. ఇది ప్రాథమిక డిజిటల్ అవగాహన నుంచి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అర్హతలు, ఉపాధి అవకాశాల వరకు మార్గాలను సృష్టిస్తుంది.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకుని, ఏడబ్ల్యూఎస్ డిజిటల్ ట్రైనింగ్ కంటెంట్‌తో అభ్యర్థులు తమ శిక్షణను ప్రారంభించవచ్చు. తద్వారా తమకు అనుకూలమైన రీతిలో ప్రాథమిక ఏఐ, క్లౌడ్ నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చు. తగిన నైపుణ్యాలు సాధించినవారు ఏడబ్ల్యూఎస్ రీ/స్టార్ట్‌కు వెళ్లొచ్చు.

ఇది క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సెక్యూరిటీ, నెట్‌వర్కింగ్, ఏఐ ప్రాథమిక అంశాలలో నిర్మాణాత్మకమైన, నిపుణుల-నేతృత్వంలోని శిక్షణను అందిస్తుంది. వృత్తిపరమైన మార్గదర్శకులు, ప్రముఖ నిపుణులు అందించే తోడ్పాటుతో ప్రోగ్రామింగ్, నెట్‌వర్కింగ్, సెక్యూరిటీ, రిలేషనల్ డేటాబేస్‌ల్లో అభ్యర్థులు శిక్షణ పొందుతారు. ఈ నైపుణ్యాలను వాస్తవ పరిస్థితుల ఆధారంగా, ప్రయోగాత్మకంగా, కోర్సు వర్కు ద్వారా నేర్చుకుంటారు. కోర్సు పూర్తి చేసుకున్నవారు ఏడబ్ల్యూఎస్ సర్టిఫికేషన్ పొందుతారు.

క్లౌడ్ కంప్యూటింగ్ నైపుణ్యాల్లో పరిశ్రమ గుర్తింపు పొందిన ఈ అర్హతలతో పాటు, స్థానిక సంస్థలతో అనుసంధానం ద్వారా తమ అర్హతలకు తగిన ఇంటర్వ్యూ అవకాశాలను పొందుతారు. జాతీయ హ్యాకథాన్‌తో ఈ శిక్షణా కార్యక్రమం పూర్తవుతుంది.

# కోతులు, వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలి

## -ప్రజావాణిలో గ్రామస్తుల వినతి




నల్గొండ, ఆగష్టు 24:మండల కేంద్రంలో కోతులు, వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ గ్రామస్తులు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

మండల కేంద్రంలోని పలు కాలనీలు, ప్రధాన వీధులు, నివాస ప్రాంతాల్లో కోతులు గుంపులుగా సంచరిస్తూ ఇళ్లలోకి ప్రవేశించడం, ఆహార పదార్థాలను తీసుకెళ్లడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు వెళ్లే సమయంలో కోతుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

వీధి కుక్కల సంఖ్య కూడా అధికంగా ఉండటంతో రోడ్లపై ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. కుక్కలు గుంపులుగా తిరుగుతూ వాహనదారులను వెంబడించడం, ప్రజలను భయపెట్టడం వంటి పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వీధి కుక్కల బెడద మరింత తీవ్రంగా ఉంటోందని వివరించారు.

కోతులు, వీధి కుక్కల బెడద కారణంగా ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. కోతుల నియంత్రణకు అటవీ శాఖ, సంబంధిత అధికారులతో వీధి కుక్కల నియంత్రణకు నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రజల భద్రతకు సంబంధించిన ఈ సమస్యను అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గుర్రపు శ్రీధర్, దేవరకొండ సత్యనారాయణ, చైతన్య గుప్త, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నం సమావేశంలో సంయుక్త ప్రకటనను ఆమోదించిన బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రులు

న్యూ ఢిల్లీ, ఆగష్టు 24:ఆంధ్ర పదేశ్‌లోని విశాఖపట్నంలో జరిగిన బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం-2026... బ్రిక్స్ క్రీడల ఉమ్మడి ప్రకటనను ఏకగ్రీవంగా ఆమోదించడంతో ముగిసింది. చర్చలు, పరస్పర గౌరవం, సమ్మిళితత్వం ద్వారా క్రీడల్లో సహకారాన్ని బలోపేతం చేయడం పట్ల సభ్య దేశాల నిబద్ధతను ఈ ప్రకటన పునరుద్ఘాటిస్తుంది.

బ్రిక్స్-2026 సారథిగా భారత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశం... సహకార ప్రాధాన్యాలు, క్రీడాభివృద్ధిపై చర్చించడానికి బ్రిక్స్ దేశాల మంత్రులు, సీనియర్ క్రీడా ప్రతినిధులను ఒకచోట చేర్చింది.

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ తన ప్రారంభోపన్యాసంలో... సభ్య దేశాల ఉమ్మడి దార్శనికతను స్పష్టమైన క్రీడా సహకారంగా మార్చే బ్రిక్స్ క్రీడా భాగస్వామ్యాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు.

"మనం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా... క్రీడాకారులు, కోచ్‌ల వ్యూహాత్మక సలహాలు-సూచనలను పంచుకోవడం, సంయుక్తంగా పోటీల నిర్వహణ, క్రీడా విజ్ఞాన సంబంధిత పరిజ్ఞానాన్ని పంచుకోవడం వంటి క్రీడా సంబంధిత సహకారం కోసం నిజమైన వేదికను సృష్టించే బ్రిక్స్ క్రీడా భాగస్వామ్యాన్ని నిర్మించాలి" అని డాక్టర్ మాండవీయ పేర్కొన్నారు.

దేశ నిర్మాణంలో క్రీడల పాత్రను స్పష్టం చేస్తూ... భారత్ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో తన క్రీడా వ్యవస్థను మెరుగుపరుచుకుంటూ క్రీడా మైదానం నుంచి పతకాలు అందుకునే పోడియం వరకు అవకాశాలను విస్తరిస్తోందని డాక్టర్ మాండవీయ అన్నారు.

క్రీడా సామాగ్రి తయారీని బలోపేతం చేయడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలను కేంద్ర మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. త్వరలో ప్రారంభించనున్న క్రీడా సామాగ్రి తయారీ క్లస్టర్ల ప్రోత్సాహక పథకం... పెట్టుబడులను సులభతరం చేస్తుందనీ, ప్రపంచ మార్కెట్ల కోసం దేశీయ తయారీని ప్రోత్సహిస్తుందనీ ఆయన పేర్కొన్నారు.

"ప్రపంచవ్యాప్తంగా ఉన్న తయారీదారులు, టెక్నాలజీ కంపెనీలు, పెట్టుబడిదారులు 'మేక్ ఇన్ ఇండియా, ప్లే ఇన్ ఇండియా, గ్రో విత్ ఇండియా'లో పాలుపంచుకోవాలని వేం ఆహ్వానిస్తున్నాం" అని ఆయన అన్నారు. పారా-క్రీడల ప్రోత్సాహక కార్యక్రమాలు, క్రీడల్లో మహిళల అధిక భాగస్వామ్యం కోసం కొత్త మార్గాల ద్వారా క్రీడలను మరింత సమ్మిళితం చేయడానికి భారత్ కట్టుబడి ఉందని డాక్టర్ మాండవీయ స్పష్టం చేశారు. బ్రిక్స్ క్రీడా సామాగ్రి తయారీ సదస్సు నిర్వహణ కోసం భారత్ చేసిన ప్రతిపాదనకు విస్తృత మద్దతు లభించింది. దీని తొలి సమావేశం 2026 నవంబరు నెలలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా నిర్వహించాలని ప్రతిపాదించారు. ఈ సదస్సు... తయారీదారులు, ఎగుమతిదారు లు, పెట్టుబడిదారులు, సాంకేతిక ప్రదాతలు, చిన్న-మధ్య తరహా పరిశ్రమలు (ఎస్ఎంఈలు), అంకురసంస్థలు, పరిశోధనా సంస్థలను ఒకచోట చేర్చుతుంది. ఉత్తమ పద్ధతులను పంచుకోవడం, సాంకేతికత, ఆవిష్కరణలు, నాణ్యతా ప్రమాణాలు, బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం, పటిష్ఠ మైన సరుకు రవాణా వ్యవస్థలపై ఇది ప్రధానంగా దృష్టి సారిస్తుంది.

ఈ క్రీడలను 2026 అక్టోబర్ 12-13 తేదీల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా నిర్వహించాలని ప్రతిపాదించారు. బ్రిక్స్ దేశాలు తమ విభిన్న సాంప్రదాయిక, దేశీయ క్రీడా వారసత్వాన్ని ప్రదర్శించడానికి, పరిరక్షించుకోవడానికి ఈ క్రీడా పోటీలు ఒక చక్కని వేదికను అందిస్తాయి. పోటీ లేని, సంస్కృతిపై ప్రధానంగా దృష్టి సారించే కార్యక్రమంగా రూపొందించిన ఈ క్రీడలు... ఆయా దేశాల సంస్కృతిని గురించి తెలుసుకోవడాన్ని, ప్రజల మధ్య సంబంధాలను, పరస్పర అవగాహననూ ప్రోత్సహిస్తాయి.

సముచితమైన, సాధ్యమైన సందర్భాల్లో భాగస్వామ్య దేశాల క్రీడాకారులు- అభ్యాసకుల స్వచ్ఛంద భాగస్వామ్యాన్నీ ఈ క్రీడలు సులభతరం చేస్తాయి. ప్రతి క్రీడతో ముడిపడి ఉన్న సాంస్కృతిక ప్రాముఖ్యత, ఆచారాలు, సాంప్రదాయిక విజ్ఞాన వ్యవస్థలను గుర్తిస్తూ... ఇతర దేశాల సంస్కృతినీ గౌరవించే నియమావళి, పరస్పరం గౌరవించుకునే విధానాలు ఈ క్రీడల్లో భాగస్వామ్యానికి మార్గనిర్దేశం చేస్తాయి.

అధికారిక కార్యక్రమాలకు ముందు... విశాఖపట్నంలో జరిగిన 87వ ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్‌లో భాగంగా నిర్వహించిన బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైక్లింగ్ ఈవెంట్‌లో మంత్రులు, ప్రముఖులు పాల్గొన్నారు. డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ... కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి శ్రీమతి రక్షా ఖడ్సేల నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, యూఏఈ, ఇరాన్, దక్షిణాఫ్రికా దేశాల మంత్రులు పాల్గొన్నారు.

కీడల ద్వారా ఫిట్‌నెస్‌ను, ఆరోగ్యకరమైన జీవనశైలిని, ప్రజల మధ్య సంబంధాలను ప్రోత్సహించాలనే బ్రిక్స్ దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబించింది.

యువజన అభివృద్ధి, సమ్మిళితం, సాంస్కృతిక వినిమయం, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడంలో క్రీడల పాత్రను ప్రతినిధి బృందాలు పునరుద్ఘాటించాయి. భారత బ్రిక్స్ సారథ్యంలో సాధించిన పురోగతిని స్వాగతించాయి.

బ్రిక్స్ విధాన ప్రణాళికలో భాగంగా క్రీడల్లో సహకారాన్ని బలోపేతం చేయడం కోసం నిరంతర నిబద్ధతతో కృషి చేస్తున్న సభ్య దేశాలను డాక్టర్ మాండవీయ అభినందించారు. ఈ భాగస్వామ్యం సభ్య దేశాల మధ్య అర్థవంతమైన, నిరంతర క్రీడా సహకారంగా రూపాంతరం చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

భారత బ్రిక్స్ సారథ్య నినాదం... "అన్ని రకాల పరిస్థితులను ఎదుర్కోగల సామర్థ్యం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" సాధనకు ఈ సమావేశ తీర్మానాలు దోహదపడతాయి.

# కోదాడ మీదుగా బుల్లెట్ రైలు నడపాలి

## -అలైన్‌మెంట్ మార్చొద్దంటూ అఖిలపక్ష సమావేశంలో తీర్మానం




ఖమ్మం, ఆగష్టు 24:హైదరాబాద్-అమరావతి-చెన్నై నగరాలను కలిపే ప్రతిపాదిత హైస్పీడ్ బుల్లెట్ రైలు మార్గం అలైన్‌మెంట్‌ను మార్చవద్దని, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఈ రైలు కోదాడ మీదుగానే వెళ్లేలా చూడాలని కోరుతూ కోదాడలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. నాయకుడు రాయపూడి వెంకటేశ్వరరావు (చిన్న), మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు, వ్యాపార సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాయపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోదాడ పట్టణ ప్రజలతో పాటు భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌ను సూర్యాపేట, కోదాడ మీదుగా వెళ్లేలా ఏర్పాటు చేయాలని కోరారు. ఇది తన ఒక్కరి నిర్ణయం కాదని, కోదాడ నియోజకవర్గ భవిష్యత్ తరాల ప్రజల ఆకాంక్ష అని తెలిపారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల ముఖ్యులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు, వ్యాపార సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు కలిసి రావడం సంతోషకరమన్నారు. బుల్లెట్ రైలు కోదాడ మీదుగా వెళ్లేలా భవిష్యత్‌లో కార్యాచరణ రూపొందించుకోవాలని కోరారు.

కోదాడకు రైలు అవసరమా అనే ప్రశ్నకు రేపటి భవిష్యత్ తరాల కోసం వంద శాతం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఒకప్పుడు హైదరాబాద్ నుంచి కోదాడకు రావాలంటే సింగిల్ రోడ్డు మాత్రమే ఉండేదని, ఆ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగేవని గుర్తుచేశారు. కోదాడ నుంచి హైదరాబాద్ వెళ్లాలన్నా, హైదరాబాద్ నుంచి కోదాడ రావాలన్నా కనీసం ఐదు గంటల సమయం పట్టేదని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ఎన్నో పోరాటాలు చేసి జాతీయ రహదారి 65ను సాధించుకున్నామని చెప్పారు. తక్కువ సమయంలో ఎక్కువ దూరం ప్రయాణించగలిగే సౌకర్యాన్ని భవిష్యత్ తరాల కోసం ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రస్తుతం కోదాడ మీదుగా రైలు అలైన్‌మెంట్ సాధించే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వరరావు కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతికి వెళ్లే రైలు మార్గం అలైన్‌మెంట్‌లో మార్పులు జరుగుతున్న నేపథ్యంలో జనసాంద్రత, ప్రమాదాల నివారణ, భవిష్యత్ తరాల అవసరాలు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

కోదాడలో సిమెంట్ పరిశ్రమలు, వ్యాపార కేంద్రాలు, విద్యాసంస్థలు ఉన్నాయని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నారని చెప్పారు. విద్యాసంస్థలు మరింత అభివృద్ధి చెందాలన్నా, పారిశ్రామికంగా పట్టణం ముందుకు సాగాలన్నా ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అవసరమన్నారు. భవిష్యత్ తరాల కోసం బుల్లెట్ రైలు కోదాడ మీదుగా వెళ్లేలా సాధించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

పక్కనే ఉన్న సూర్యాపేటలో బుల్లెట్ రైలు కోసం ఉద్యమం కొనసాగుతోందని, అదే విధంగా కోదాడకు కూడా బుల్లెట్ రైలు సాధించుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన కోరారు. ఉద్యమంలో ఎవరు భాగస్వాములు కావాలి, ఎలాంటి కార్యాచరణ చేపట్టాలి అనే అంశాలపై అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కలిసి నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. కోదాడ మీదుగా బుల్లెట్ రైలు వెళ్లేలా ప్రభుత్వం, రైల్వే శాఖపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు కోరారు.

# యూరియా కోసం రైతులు నిరీక్షణ

## -ఎరువుల కోసం పడిగాపులు.. సాంకేతిక సమస్యతో ఇబ్బందులు



నిజామాబాద్, ఆగష్టు 24: ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా యూరియా, ఇతర ఎరువులను పొందేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సదాశివనగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ప్రస్తుతం 440 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయి. ఎరువుల కోసం రైతులు చేతిలో మొబైల్ ఫోన్లు పట్టుకుని యాప్ ద్వారా యూరియాను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు.

సాంకేతిక సమస్య కారణంగా యూరియా బుకింగ్ కాకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రూపొందించిన యాప్ నిర్వహణ తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూరియా కోసం వ్యవసాయ పనులను పక్కనపెట్టి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని సందర్భాల్లో కొంతమంది రైతులకు మాత్రమే ఎరువులు బుక్ అవుతుండగా, మరికొందరికి నో స్టాక్ అని చూపిస్తుం డటంతో యాప్‌పై రైతులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు అవసరమైన సమయంలో యూరియా అందకపోవ డంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

ఎరువుల బుకింగ్ కోసం ప్రభుత్వం రూపొందించిన ఫ్రేమ్ ఫర్ ఫర్టిలైజర్ యాప్‌ను తొలగించి, గతంలో మాదిరిగానే రైతులకు అవసరమైన ఎరువులను నేరుగా అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి యూరియా సరఫరా సజావుగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# కౌలాస్ నాలా ప్రాజెక్టుకు భారీ వరద

## -ఒక గేటు ఎత్తి 510 క్యూసెక్కుల నీటి విడుదల..

## -కాలువల ద్వారా మరో 80 క్యూసెక్కులు

కామారెడ్డి, ఆగష్టు 24:(నేటినిజం ప్రతినిధి): జుక్కల్ మండలం సాగర్‌గాం వద్ద ఉన్న కౌలాస్ నాలా ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో సోమవారం ఉదయం ప్రాజెక్టులోకి పెద్దఎత్తున వరద ప్రవాహం నమోదైంది. దీంతో అధికారులు ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి వరద వాగు ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రాజెక్టు ఏఈఈ సుకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఉదయం ప్రాజెక్టులోకి 890 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ఒక గేటు ఎత్తి 510 క్యూసెక్కుల నీటిని వరద వాగు ద్వారా విడుదల చేయడంతో పాటు, వ్యవసాయ ఆధారిత కాలువ ద్వారా మరో 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 590 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 458 మీటర్లు, 1.237 టీఎంసీలు కాగా ప్రస్తుతం 457.83 మీటర్ల మేర నీటిమట్టాన్ని నిలకడగా ఉంచుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా ఆకస్మికంగా వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున వరద కాలువ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదల శాఖ అధికారులు సూచించారు.

# వర్షం వస్తే వీధి చెరువే.. సీసీ రోడ్డు ఎత్తు పెంచాలని వినతి

## -శివాజీ విగ్రహం వెనుక సూపర్ మార్కెట్ వీధిలో నిలిచిపోతున్న వర్షపు నీరు



కామారెడ్డి, ఆగష్టు 24:(నేటినిజం ప్రతినిధి): ఎడపల్లి గ్రామంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం వెనుక ఉన్న సూపర్ మార్కెట్ వీధిలో వర్షపు నీరు నిలిచిపోతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల శివాజీ విగ్రహం వద్ద ప్రధాన రహదారి ఎత్తు పెంచడంతో, దాని వెనుక ఉన్న వీధిలోని సీసీ రోడ్డు ప్రధాన రహదారితో పోలిస్తే పల్లంగా మారింది. దీంతో వర్షం కురిసిన ప్రతిసారి నీరంతా వీధిలోనే నిలిచిపోతుండగా, బయటకు వెళ్లేందుకు సరైన మార్గం లేక సమస్య తీవ్రంగా మారుతోందని కాలనీ వాసులు తెలిపారు.

ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఆ మార్గంలో నడవడానికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే సీసీ రోడ్డు ఉన్నప్పటికీ దాని ఎత్తు తక్కువగా ఉండటమే సమస్యకు ప్రధాన కారణమని 4వ వార్డు సభ్యులు తెలిపారు. సంబంధిత వీధిలోని సీసీ రోడ్డును తగినంత ఎత్తు పెంచి, వర్షపు నీరు సులభంగా బయటకు వెళ్లేలా పునర్నిర్మించాలని గ్రామ సర్పంచ్ రాంచందర్‌కు వారు వినతి చేశారు.

# పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యం

## -గాంధీ భవన్‌లో సచిన్ సవంత్‌తో తోపాజీ అనంతకిషన్ భేటీ



సంగారెడ్డి, ఆగష్టు 24:(నేటి నిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్ అన్నారు. సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సవంత్‌తో అనంతకిషన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఎస్ఐఆర్ తదితర అంశాలపై సచిన్ సవంత్ ఆరా తీసినట్లు అనంతకిషన్ తెలిపారు. ముఖాముఖి సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రజలకు ఏ మేరకు చేరుతున్నాయి, వాటిపై ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అప్పగించిన కార్యక్రమాల అమలు తీరు ఎలా ఉందనే అంశాలను సచిన్ సవంత్ అడిగి తెలుసుకున్నట్లు అనంతకిషన్ పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా పార్టీ శ్రేణులు మరింత చురుగ్గా పనిచేయాల్సిన అవసరంపై చర్చించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించినట్లు చెప్పారు.

కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ ప్రస్థానం, ఇప్పటివరకు నిర్వహించిన వివిధ బాధ్యతలు, చేపట్టిన పదవులు, పార్టీ కోసం చేపట్టిన కార్యక్రమాల గురించి కూడా సచిన్ సవంత్ వివరాలు అడిగి తెలుసుకున్నారని అనంతకిషన్ తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో తన పాత్ర, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి చేపట్టిన కార్యక్రమాలను ఆయనకు వివరించినట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరంపై సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు.

సచిన్ సవంత్ అడిగిన అన్ని అంశాలకు తాను స్పష్టంగా సమాధానాలు ఇచ్చినట్లు తోపాజీ అనంతకిషన్ వెల్లడించారు. భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాలపై సమీక్షతో పాటు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమావేశం సాగిందని అనంతకిషన్ పేర్కొన్నారు.

పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించినట్లు అనంతకిషన్ చెప్పారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు

# సీనియర్ మేటీలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలి

## -2018 నుంచి ఉపాధి హామీ పనుల్లో సేవలు.. వేతనం లేకుండా పనిచేస్తున్నామని ఆవేదన

మహబూబ్‌నగర్, ఆగష్టు 24:ఉపాధి హామీ పథకంలో 2018 నుంచి సీనియర్ మేటీలుగా పనిచేస్తున్న తమను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని కోరుతూ సీనియర్ మేటీలు సోమవారం ఊట్కూర్ ఎంపీడీవో పావనికి వినతిపత్రం సమర్పించారు. ఎన్నో సంవత్సరాలుగా ఉపాధి హామీ పనుల నిర్వహణలో కీలకంగా సేవలందిస్తున్న తమ అనుభవాన్ని ప్రభుత్వం గుర్తించి ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా సీనియర్ మేటీలు భీమ్‌శంకర్, నరహరి మాట్లాడుతూ 2018 నుంచి 2026 వరకు నిరంతరం ఉపాధి హామీ పథకంలో పనిచేసినప్పటికీ తమకు ఎలాంటి వేతనం లేకుండా సేవలు అందిస్తున్నా ని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పనులను గుర్తించడం, కూలీలను సమీకరించడం, పనుల నిర్వహణలో సహకరించడం, కూలీల వివరాలను పర్యవేక్షించడం వంటి బాధ్యతలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న వీబీజీ రామ్‌జీ పథకంలోనూ విధులు నిర్వర్తిస్తున్నామని పేర్కొన్నారు.

ఏళ్ల తరబడి పథకంలో పనిచేస్తూ అనుభవం సంపాదించిన తమను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమిస్తే ప్రభుత్వానికి అనుభవజ్ఞులైన సిబ్బంది అందుబా టులో ఉంటారని తెలిపారు. తమకు తగిన గుర్తింపు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మిరెడ్డి, ఈసీ మహిపాల్‌రెడ్డి, సీనియర్ మేటీలు ఇస్మాయిల్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# 129 కిలోల గంజాయి స్వాధీనం..ఇద్దరు నిందితులు అరెస్ట్



ములుగు ఆగష్టు 24:(నేటి నిజం ప్రతినిధి): వరంగల్ నార్కోటిక్స్ పోలీసులు 129 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈమేరకు సోమవారం ములుగు రోడ్డులోని నార్కోటిక్స్ పోలీసు స్టేషన్‌లో నార్కోటిక్స్ డీఎస్పీ రమేష్ ఇద్దరు నిందితులను అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు.

కేరళకు చెందిన సాయుజ్, బిసలెల్ , అజిత్, ఒడిశాకు చెందిన విక్కీ ముఠాగా ఏర్పడ్డారు. జల్సాలకు అలవాటు పడి, అక్రమంగా డబ్బులు సంపాదించాలనీ గంజాయి అక్రమ రవాణాను ఎంచుకున్నారు. 66 లక్షల 66వేల విలువ చేసే గంజాయి నీ కారులో ఒడిస్సా నుంచి బెంగళూరు కు తీసుకెళ్తున్న క్రమంలో, పక్క సమాచారం తో వరంగల్ నార్కోటిక్స్ పోలీసులు వర్ధన్నపేటలో ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు.

కారులో ఉన్న 61 ప్యాకెట్ లోని ఈ 129 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులు సాయుజ్, బెసలెల్ ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు. పరార్ లో ఉన్న ఇద్దరు నిందితులు అజిత్, విక్కీ కోసం గాలిస్తున్నామని డీఎస్పీ పేర్కొన్నారు.

# తెలుగు ప్రజలకు వరం సురవరం

అవి తెలుగు భాషను గుర్తించని, స్థానిక ప్రాంతీయ భాషకు విలువలేని, తెలుగు భాషలో చదువు కోవడానికి కూడా సౌకర్యాలు అంతగా లేని రోజులు. నిజాం పాలకుల నిరంకుశ పాలనలో సామాజిక చైతన్యం దాదాపు శూన్య స్థితిలో స్తబ్ధంగా ఉన్న సమయం. తెలంగాణ ప్రాంతంలో అధికార భాష ఉర్దూ మాధ్యమంలో చదువులు సాగడం, ఉర్దూ లోనే ప్రభుత్వ, వ్యావహారిక కార్యక్రమాలు కొనసాగడం, చదువుకున్న వారు ఉర్దూ చదవటం ఒక హోదా చిహ్నంగా ప్రజలు భావించే కాలం. అప్పుడు రాజభాషగా, పాలనా భాషగా, వ్యవహారభాషగా ఉర్దూ ఉండగా, ఉర్దూ భాషలోనే మిజాన్, జామిన్, రయ్యత్ పత్రికలు వచ్చేవి. అప్పటికి రెండు తెలుగు వార పత్రికలు మాత్రమే 'నీలగిరి' నల్లగొండ జిల్లా నుండి, 'తెలుగు' వరంగల్ జిల్లా నుంచి వెలువడు తుండేవి. అలాంటి నిజాం రాజ్యంలో, ప్రతికూల వాతావరణంలో తెలుగు పత్రికని స్థాపించడమే ఓ సాహసం. ఉర్దూ, సంస్కృతం, మరాఠీ భాషలు రాజ్యమేలుతున్న నిజాం రాజ్యంలో తెలుగు సాహిత్యం నిలదొక్కుకునేందుకు 'గోలకొండ పత్రిక' బీజం వేసింది.

హైదరాబాద్ సంస్థానంలోని తెలుగు ప్రజల విజ్ఞానానికి తెలుగులో పత్రికను ప్రారంభించాలని నిశ్చయించారు. అంధకార బంధుర మైన నాటి పరిస్థితులలో గోలకొండ పత్రిక అనే చిరుదివ్వెను వెలిగించి తన బహుముఖ ప్రజ్ఞతో సంస్థలను, ఉద్యమాలను నిర్మించి, ప్రజల చైతన్యాన్ని తట్టిలేపే బృహత్తర కార్యక్రమం ప్రారంభించారు సురవరం ప్రతాపరెడ్డి. మాతృ భాషలో చదువుకొనే అవకాశాలు లేక అంతా ఉర్దూమయమై, నిజాం నిరంకుశ పరిపాలనలో, నిద్రాణ స్థితిలో ఉన్న తెలంగాణను జాగృతం చేయాలన్న సురవరం దీక్ష ఫలితమే...1926 మే 19న గోలకొండ పత్రిక ప్రారంభ నేపథ్యం. ఆ పత్రిక వారానికి రెండు మార్లు వెలువడు తుండేది. పత్రిక నిర్వహణలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. జాతీయ భావాలను ధైర్యంగా ప్రచారం చేశారు. 1947 లో అది దినపత్రికగా మారింది. నిజాంను తన పత్రికలలో ఏకిపారేస్తూ దూకుడుగా వ్యవహరించేవారు సురవరం. ఒక దశలో నిజాం రాజు గోలకొండ సంపాదకీయాలకు భయపడ్డారంటే... ఆయన కలం నిజాం ను ఎంత కలవర పరిచిందో అర్థం చేసుకోవచ్చు.

పత్రిక ఆదర్శాలను గురించి వివరిస్తూ ప్రతాపరెడ్డి ఒక సంపాదకీయంలో... "మేము మా పత్రిక స్థాపన కాలం నుండియు రెండంశములు దృష్టి పథమందుంచు కొని దేశీయులకు సేవ చేయు చున్నాము. మొదటిది ఆంధ్రాభాషా సేవ, రెండవది జాతి, మత, కుల వివక్షత లేక ఆంధ్రులలో సర్వశాఖల వారి యొక్క సత్వరాభివృద్ధికై పాటుపడుట".

ఈ ఆశయాన్ని నెరవేర్చేందుకే ప్రతాపరెడ్డి క్షణం విశ్రాంతి లేకుండా ఎనలేని కృషి చేశారు. గోలకొండ పత్రికకి సురవరమే సర్వస్వంగా ఉండేవారు. సంపాదకుడి దగ్గర నుంచి ప్రూఫ్ రీడరు వరకూ అన్ని బాధ్యతలూ నెత్తిన వేసుకుని పత్రికను నడిపించే వారు. గోలకొండ ప్రతాపరెడ్డి ప్రతిభకు అద్దం పట్టింది. తెలంగాణ ప్రజానీకాన్ని జాగృత పరచటంలో అద్భుత పాత్రను నిర్వహించింది. గోల్కొండ పత్రిక, దానికి అనుబంధంగా భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను స్థాపించి పత్రికా సంపాదకుడిగా,రచయితగా సేవలు అందించారు. ఆయన రాసిన వ్యాసాలూ, పద్యాలూ, విమర్శలూ, సంపాదకీయాలూ 1000కి మించి ఉంటాయి. ఇతర పత్రికల్లో 100కు పైగా వ్యాసాలు రాసి ఉంటారు. కథానికలూ, కవితలూ రాశారు. పత్రికలో కొన్ని శీర్షికలని స్వయంగా నిర్వహించారు. చిత్రగుప్త, భావకవి, రామ్మూర్తి, యుగపతి సింహ, సంగ్రామసింహ

**ఆగస్టు 25...సురవరం ప్రతాపరెడ్డి వర్ధంతి**



మొదలైన ఎన్నో మారుపేర్లతో ఆయన అసంఖ్యాక రచనలు చేశారు.

1896 మే 28 తేదీన జన్మించిన సురవరం కర్నూలులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. వెల్లాల శంకరశాస్త్రి వద్ద సంస్కృత కావ్యాలు, వ్యాకరణం చదువు కొన్నారు. నిజాం కాలేజీలో ఎఫ్.ఎ. మద్రాసు ప్రెసిడెన్సి కాలేజిలో బి.ఎ. చదివిన తర్వాత బి.ఎల్. చదివి న్యాయవాద వృత్తిని చేపట్టారు. కాని ఎంతో కాలం ఆ వృత్తిలో ఉండలేక పోయారు.

గాంధీజీ నాయకత్వంలో సాగుతున్న స్వాతంత్ర్య పోరాటం ఆయనను ఆకర్షించింది. తెలంగాణ ప్రజల దైన్యం, దారిద్ర్యం, ప్రాథమిక హక్కులను కూడా నోచుకోని దుస్థితి చూచి చలించి పోయారు. భావుకుడైన రచయితగా, సురవరం కథలు నిజాం కాలం నాటి ప్రజల జీవితాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించినవి.

1924లో హైదరాబాద్ లోని రెడ్డి హాస్టల్ కార్యదర్శిగా నియమితులై, ప్రతాపరెడ్డి హాస్టల్ విద్యార్థులలో క్రమశిక్షణ నెలకొల్పి వారిని చైతన్య వంతులను కావించి, నాటి కొత్వాల్ అయిన రాజా బహదూర్ ఆశీస్సులతో 1926 మే 10వ తేదీన 'గోలకొండ' పత్రికను ప్రారంభించారు. పోలీస్ చర్య వరకు ప్రతాపరెడ్డి 'గోలకొండ' పత్రికా సంపాదకులుగా పనిచేసారు. 1930లో మెదక్ జిల్లా జోగిపేటలో జరిగిన మొట్టమొదటి 'ఆంధ్ర మహాసభ'కు అధ్యక్షత వహించారు. కార్యాకలాపాలన్ని తెలుగులోనే జరగాలంటూ తీర్మానం చేయించారు.

1951 లో ప్రతాపరెడ్డి పులిజాల హనుమంతరావు తో కలిసి 'ప్రజావాణి' దినపత్రికను స్థాపించి రెండేళ్ళు నడిపారు.

ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి పట్ల ప్రగాఢమైన అభిమానం ఉండేది. ప్రజలలో విజ్ఞాన వికాసానికి గొప్ప రచనలు చేశారు. తెలంగాణా ప్రజల భాషనుకాని, సంస్కృతినిగాని తక్కువ చేసి మాట్లాడితే సహించేవారు కాదు. తెలంగాణలో తెలుగు కవులు లేరన్న ముడుంబ వెంకట రాఘవాచార్య వ్యాఖ్యలకు స్పందించి, 354 మంది తెలంగాణ కవుల పరిచయాలతో కూడిన 'గోల్కొండ కవుల సంచిక'ను విడుదల చేశారు సురవరం.

ఆయన నిజాం రాష్ట్ర పాలన, మొగలాయి కథలు, సంఘోద్ధరణ, ఉచ్ఛల విషాదము, గ్రంథాలయము, హిందువుల పండుగలు, హైందవ ధర్మవీరులు, యువజన విజ్ఞానం మొదలైన రచనలు, దాదాపు 40 గ్రంథాలు రచించారు. సురవరం రచించిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'కు 'కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు' లభించింది. దానిలో దాదాపు వెయ్యేళ్ల ఆంధ్రుల చరిత్రను నమోదు చేశారు.

తెలంగాణలో గ్రంథాలయోద్యమంలో ప్రతాపరెడ్డి ప్రముఖపాత్ర వహించారు. 1942లో ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు. 1943లో ఖమ్మంలో జరిగిన గ్రంథాలయ మహాసభకు, 1944లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు ఆయనే అధ్యక్షులు.

1952 లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో, మిత్రుల ఒత్తిడిపై వనపర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పక్షాన పోటీచేసి విజయం సాధించారు. కాని రాజకీయాలు ఆయనకంతగా రుచించలేదు. త్యాగము, దేశభక్తి, భాషాభిమానం ప్రజా శ్రేయస్సు పరమార్థంగా జీవించిన సురవరం ప్రతాపరెడ్డి 1953 ఆగష్టు 25న దివంగతులయ్యారు.

అయన సేవలు అందుకొనని సంస్థ తెలంగాణలో లేదంటే అతిశయోక్తి కాదు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు.

శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, వేమన ఆంధ్ర భాషా నిలయం, హిందీ ప్రచారసభ తదితర సంస్థల ప్రగతికి ఎంతో కృషి చేశారు. తెలుగు జాతికి అయన చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాదు లోని ట్యాంక్ బండ్ పై ప్రతిష్ఠించిన విగ్రహాలలో సురవరం విగ్రహం ఉంది. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఫారసీ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులుగా,

పత్రికా సంపాదకుడుగా, న్యాయవాదిగా, రచయితగా, సంఘ సంస్కర్తగా, ప్రజా ప్రతినిధిగా, చరిత్ర కారునిగా, పరిశోధకుడుగా, పండితుడుగా, క్రియాశీల ఉద్యమ కారుడుగా బహుముఖాలుగా సాగిన సురవరం ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైనవి.

తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో సురవరం ఒక అధ్యాయం. ఆయన తెలుగు ప్రజలకు వరం...



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## 'ఐటీసీ డిస్పెన్సరీ నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపాలి'

### -ఐటీసీ హెచ్ఆర్ హెడ్కు కార్మిక సంఘాల వినతి



ఖమ్మం, ఆగష్టు 24:సారపాక అద్దె భవనంలో నడుస్తున్న ఐటీసీ డిస్పెన్సరీ నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపాలని ఐటీసీ పీఎస్ పీడీ వర్కర్స్ యూనియన్ (గుర్తింపు సంఘం)తో పాటు పలు కార్మిక సంఘాల నాయకులు సోమవారం ఐటీసీ పీఎస్ పీడీ హెచ్ఆర్ హెడ్ శ్యామ్ కిరణ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఐటీసీ పీఎస్పీడీ భద్రాచలం యూనిట్లో పని చేస్తున్న 5 వేల మంది కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సుమారు 20 వేల మంది ఈఎస్ఐ డిస్పెన్సరీలో వైద్య సేవలు పొందుతున్నారన్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె భవనంలో నడుస్తుండగా అద్దె చెల్లింపు జాప్యం కారణంగా భవన యజమాని డిస్పెన్సరీ ఖాళీ చేయాలని నోటీసు ఇచ్చారని మా దృష్టికి వచ్చిందని, దీనివల్ల వేలాదిమంది కార్మికులు, కుటుంబ సభ్యులు, ఇతర ఈఎస్ఐ లబ్దిదారులు అవసరమైన వైద్యసేవలకు దూరమయ్యే అవకాశం ఉందని ఈఎస్ఐ డిస్పెన్సరీకి శాశ్వతమైన, అనుకూలమైన, సులభంగా అందుబాటులో ఉండే ప్రాంగణాన్ని కేటాయించడం అవసరమని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

ఐటీసీ పరిధిలోని ఎస్బీఐ బ్యాంకు భవనంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న గదులు డిస్పెన్సరీ నిర్వహణకు అనువైన స్థలంగా ఉంటుందని భావించి 15న కంపెనీలోని అన్ని కార్మిక సంఘాలు ఉమ్మడిగా చర్చించి ప్రతిపాదన తమ ముందుకు తీసుకువచ్చినట్లు తెలిపారు. డిస్పెన్సరీ నిర్వహణను ఎస్బీఐ ఆవరణలో గదులకు కేటాయించేలా సిఫార్సు చేయడంతో పాటు సహకారం అందించాలని కోరారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దెను యాజమాన్యం కొంతకాలం కట్టిందని, ఇది రెండవ ఆప్షన్గా పరిగణించాలన్నారు. మూడవ ఆప్షన్గా ఈస్ట్ పక్కన అవుట్ లెట్ పైపులైనుపై ఉన్న పరిశ్రమకు సంబంధించిన ఖాళీ స్థలాల్లో డిస్పెన్సరీని నిర్మిస్తే బాగుంటుందని ప్రతిపాదన చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గుర్తింపు సంఘంతో పాటు పలు కార్మిక, క్రాంటాక్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 129 కిలోల గంజాయి స్వాధీనం..ఇద్దరు నిందితులు అరెస్ట్



వరంగల్, ఆగష్టు 24:వరంగల్ నార్కోటిక్స్ పోలీసులు 129 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈమేరకు సోమవారం ములుగు రోడ్డులోని నార్కోటిక్స్ పోలీసు స్టేషన్లో నార్కోటిక్స్ డీఎస్పీ రమేష్ ఇద్దరు నిందితులను అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు.

కేరళకు చెందిన సాయుజ్, బిసల్లెల్ , అజిత్, ఒడిశాకు చెందిన విక్కీ ముఠాగా ఏర్పడ్డారు. జల్సాలకు అలవాటు పడి, అక్రమంగా డబ్బులు సంపాదించాలనీ గంజాయి అక్రమ రవాణాను ఎంచుకున్నారు. 66 లక్షల 66వేల విలువ చేసే గంజాయి నీ కారులో ఒడిస్సా నుంచి బెంగళూరు కు తీసుకెళ్తున్న క్రమంలో, పక్క సమాచారం తో వరంగల్ నార్కోటిక్స్ పోలీసులు వర్ధన్నపేటలో ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు.కారులో ఉన్న 61 ప్యాకెట్ లోని ఈ 129 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులు సాయుజ్, బెసలెల్ ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు. పరార్ లో ఉన్న ఇద్దరు నిందితులు అజిత్, విక్కీ కోసం గాలిస్తున్నామని డీఎస్పీ పేర్కొన్నారు.

## సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి

నల్గొండ, ఆగష్టు 24: ఎల్నినో (ఇశ్రీనితినినీ) ప్రభావంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కరువు పరిస్థితులు తీవ్రంగా మారాయి. చెరువులు, కుంటలు ఎండిపోవడంతో పాటు బోర్లు కూడా వట్టిపోతున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండలోని సీపీఐ(ఎం) దొడ్డి కొమురయ్య భవన్లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజలు, పశువులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో నాగార్జునసాగర్ నుంచి ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి. ఈ కాలువ పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నింపాలని ఆయన డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్లో ప్రస్తుతం 534 అడుగుల వరకు నీరు ఉందని, 34,438 క్యూసెక్కుల వరద నీరు వస్తోందని ఆయన తెలిపారు.

కరువు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం (ాబిజీబివ ఉనీలబి) తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొని నీటి కోసం కేంద్రం, పొరుగు రాష్ట్రాలపై ఒత్తిడి తేవాలని సూచించారు. నల్లగొండ, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్యను కొంతవరకు పరిష్కరించడంతో పాటు మార్గమధ్యంలోని చెరువులను నింపేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారీ ఐలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాషం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, చినపాక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## లారీ ఢీకొని భార్య దుర్మరణం..

### -భర్తకు తీవ్ర గాయాలు.. గుంటుపల్లి సెంటర్లో ప్రమాదం

అమరావతి, ఆగష్టు 24: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై గుంటుపల్లి సెంటర్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం చెందగా, భర్త తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గుంటుపల్లి ఖాజీపేట అంజని గ్రీన్ పార్క్లో నందం బాలగంగాధరరావు కుటుంబం నివసిస్తోంది. సోమవారం బాలగంగాధరరావు (61) తన భార్య నిర్మల జ్యోతి (56)తో కలిసి ద్విచక్ర వాహనంపై వన్టౌన్లోని వారి బంగారు నగల దుకాణానికి పనికి బయలుదేరారు.

కొద్ది నిమిషాల్లోనే గుంటుపల్లి సెంటర్లో వారి ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నిర్మల జ్యోతి అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

ప్రమాదంలో ఆవెం తల భాగానికి తీవ్ర గాయాలయ్యాయి. బాలగంగాధరరావు కూడా తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

నిర్మల జ్యోతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై గుంటుపల్లి సెక్టార్ ఎస్సై సత్యవతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్, ఏఎంసీ చైర్మన్



ఆదిలాబాద్, ఆగష్టు 24: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల ను ఇంద్రవెల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ రాథోడ్ మోహన్ సింగ్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్ లబ్ధిదారులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లబ్ధిదారుల పూర్తి వివరాలతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డును ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎండీ జహీర్, పట్టణ అధ్యక్షులు జితేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కాంబ్లె బాబా రావ్, నాయకులు మిర్జా యాకుబ్ బేగ్, కిషోర్ సోమసే, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునీకరించిన షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపం ప్రారంభం

అమరావతి, ఆగష్టు 24: చిత్తూరు దొడ్డిపల్లిలోని చిత్తూరు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలోని కళ్యాణ మండపానికి ఆధునిక సదుపాయాలు కల్పించి పూర్వ వైభవం తీసుకొచ్చారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన ఆధునీకరణ పనులు పూర్తికావడంతో సోమవారం ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జాయింట్ కలెక్టర్, షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ ఆదర్శ్ రాజేంద్రన్, చుడా చైర్పర్సన్ కఠారి హేమలత తదితరులు కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు మాట్లాడుతూ సంస్థ ఆస్తులను పరిరక్షించడంతో పాటు కళ్యాణ మండపాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆధునీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో కళ్యాణ మండపాన్ని పరిశీలించినప్పుడు దాని పరిస్థితిపై అధికారులు చేసిన సూచనల మేరకు అవసరమైన సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. కళ్యాణ మండపం ద్వారా వచ్చే ఆదాయాన్ని కనీసం సిబ్బంది జీతాలకైనా వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చిత్తూరు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ సమస్యను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఎంపీ పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా ఫ్యాక్టరీ సమస్య కొనసాగుతోందని, చెరకు సాగు తగ్గిపోవడం, ముడి సరుకు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో ఫ్యాక్టరీ కార్యకలాపాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఫ్యాక్టరీపై ఉన్న అప్పులు, వాటిపై పెరుగుతున్న వడ్డీల కారణంగా భవిష్యత్తులో ఆస్తుల విలువ కంటే అప్పులు అనేక రెట్లు పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఇక ఆలస్యం చేయకుండా సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని, ఎమ్మెల్యేతో కలిసి తాను కూడా సహకరిస్తానని చెప్పారు.

ఫ్యాక్టరీ డైరెక్టర్లు, రైతులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయా లను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదించి సమస్య పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు.

జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ తాను కళ్యాణ మండపాన్ని సందర్శించిన సమయంలో పరిస్థితి దారుణంగా ఉండేదన్నారు. సీపేజ్, పెయింటింగ్, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాలు సరిగా లేకపోవడంతో ప్రజలకు వినియోగించుకునే పరిస్థితి లేదని తెలిపారు. అయితే చిత్తూరులో ఈ కళ్యాణ మండపానికి ఎంతో గొప్ప చరిత్ర ఉందని, ఒకప్పుడు ఇది నగరంలోనే ప్రముఖ కళ్యాణ మండపంగా పేరొందిందని గుర్తుచేశారు.

కళ్యాణ మండపానికి పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో ఆధునీకరణ పనులు చేపట్టినట్లు జేసీ తెలిపారు. కలెక్టర్తో చర్చించి ఆర్థిక సహకారం పొందడంతో పాటు సంస్థకు అందుబాటులో ఉన్న నిధులను వినియోగించి సుమారు రూ.20 లక్షలతో ప్రాథమిక ఆధునీకరణ పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ఇకపై చిత్తూరు పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ కళ్యాణ మండపాన్ని అధికంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రజల వినియోగం పెరిగితే సంస్థకు ఆదాయం సమకూరడంతో పాటు కళ్యాణ మండపానికి పూర్వ వైభవం తిరిగి వస్తుందని తెలిపారు.

ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీ ప్రాంతంలో ఉన్న ఈ కళ్యాణ మండపం వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునేందుకు అనువైన ప్రదేశమన్నారు.

విశాలమైన పార్కింగ్ స్థలం, భోజనశాల, గదులు, విశాలమైన హాలు వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ బాధ్యతలు స్వీకరించిన కొద్ది నెలల్లోనే చిత్తూరు ప్రజలకు ఉపయోగపడే పలు కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన అనంతరం జేసీ కళ్యాణ మండపాన్ని పరిశీలించి దాని పరిస్థితిని మెరుగుపరిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గుర్తించి ఆధునీకరణకు చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

చిత్తూరు నియోజకవర్గ ప్రజలు ఈ కళ్యాణ మండపాన్ని వివాహాలు, ఇతర శుభకార్యాలకు ఎక్కువగా వినియోగించుకోవాలని కోరారు.

ప్రజలు దీనిని వినియోగించడం ద్వారా షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులు, డైరెక్టర్లు, సంస్థకు పరోక్షంగా సహకరించినట్లవుతుందని చెప్పారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.